http://www.agnidharanews.com

# అగ్నిధార

మంగళవారం 14 జూలై 2026

నిజాల నిప్పు కణిక

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

## విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828

## భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?



- పీయూశ్ గోయల్ ఇచ్చిన క్లారిటీ ఇదే!
- "అవన్నీ అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించే వార్తలు"
- భారత్, అమెరికా వాణిజ్య ఒప్పందంపై ప్రతిష్టంభన ఏర్పడిందనే వార్తలను ఖండించిన కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్

# మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు

- మెట్రో విస్తరణకు కేంద్ర ప్రభుత్వ సహకారం అవసరం
- అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలి
- ఎంపీలకు సూచించిన సీఎం
- రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ
- పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ అంశాలపై అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ
- పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపీలకు వివరించినట్లు సమాచారం



హైదరాబాద్

పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణ అంశాలపై అనుసరించాల్సిన వ్యూహంపై కాంగ్రెస్ రాష్ట్ర ఎంపీలతో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న తెలంగాణ ప్రాజెక్టులు, అనుమతులు రావాల్సిన అంశాలను ఎంపీలకు వివరించి వాటి సాధనకు పోరాడాలని దిశానిర్దేశం చేశారు. ప్రజాభవన్‌లో జరిగిన ఈ సమావేశానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎంపీలకు రేవంత్ రెడ్డి తెలిపారు. మెట్రో రైలు విస్తరణకు కేంద్ర సహకారం అవసరమని, ఆర్‌ఆర్‌ఆర్‌కు భూసేకరణ కొలిక్కి వచ్చిందని, కేంద్రం నుంచి నిధులు తెచ్చుకుని ఆర్‌ఆర్‌ఆర్ పూర్తి చేయాలని అన్నారు. హైదరాబాద్‌కు ఐఐఎం వచ్చేలా బీజేపీ ఎంపీలు చొరవ చూపాలని, మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. తుమ్మిడిహెట్టి, పోర్ట్ కనెక్టివిటీ రోడ్డుకు అనుమతులు సాధించాలని, బుల్లెట్ ట్రైన్, ఆదిలాబాద్, - మిగతా3లో

# తెలంగాణలో మళ్లీ ఎండాకాలం!



- సాధారణం కన్నా 4డిగ్రీలు అధికంగా గరిష్ఠ ఉష్ణోగ్రతలు
- వర్షాకాలంలో ఎండాకాలాన్ని తలపిస్తున్న ఎండలు
- వర్షాలు కురవాల్సిన సమయంలో అధిక ఎండలు
- సాధారణం కన్నా మూడు నుంచి 4.6 డిగ్రీలు అధికంగా నమోదవుతున్న గరిష్ఠ ఉష్ణోగ్రతలు

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో ఎండలు మండిపోతున్నాయి. వర్షాలు సంవృద్ధిగా కురవాల్సిన సమయంలో ఎండలు దంచికొడుతున్నాయి. సాధారణం కన్నా రెండు నుంచి నాలుగున్నర డిగ్రీలు అధికంగా నమోదవుతున్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఖమ్మం, భద్రాచలం జిల్లాల్లో 37 డిగ్రీలు నమోదు కాగా మెదక్‌లో సాధారణ స్థాయి నుంచి 4.6 డిగ్రీలు అధికంగా నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. రాగల 5,6 రోజుల - మిగతా3లో



## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

- రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసు!
- ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ యత్నించిందని ఒమర్ ఆరోపణ
- ఏడు రోజుల్లో బహిరంగ క్షమాపణ చెప్పాలని నోటీసులో బీజేపీ డిమాండ్
- లేదంటే సివిల్, క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరిక
- ఆరోపణలు నిరాధారమైనవని కొట్టిపారేసిన కాషాయదళం



## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్?

- జాబితాలో ట్రంప్, మెలోనీ, మెక్రాన్ పేర్లు!
- అమెరికా, యూరప్ నేతలే లక్ష్యంగా హిట్‌లిస్ట్ ప్రచురించిన ఇరాన్ పత్రిక
- అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగానే ఈ జాబితా అంటూ ప్రకటన
- ప్రతీకారం తీర్చుకుంటామని, నేరస్థుల జాబితా సిద్ధంగా ఉందని మొజ్తబా ఖమేనీ హెచ్చరిక
- జాబితాలో ట్రంప్, నెతన్యాహు, మెక్రాన్ సహా 13 మంది ప్రముఖులు

## ఎల్-నినో ముప్పుకు చెక్ పెట్టేలా

# యాక్షన్ ప్లాన్

- ఎల్-నినోకు తెలంగాణ రెడీ..
- రైతుల కోసం మూడు దశల కార్యాచరణ
- మూడు దశల్లో ముందస్తు ప్రణాళిక
- ప్రతి వారం మండలాల వారీగా ప్రత్యేక బులెటిన్
- జిల్లాల వారీగా పరిస్థితులపై నిత్య పర్యవేక్షణ
- ఎల్-నినో ప్రభావంతో వానాకాలం-2026లో ఏర్పడే సవాళ్లను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ సిద్ధం



హైదరాబాద్

వానాకాలం-2026లో ఎల్-నినో ప్రభావంతో ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు తెలంగాణ ప్రభుత్వం సమగ్ర కార్యాచరణ సిద్ధం చేసింది. రైతులకు నష్టం జరగకుండా మూడు దశల కంటింజెన్సీ ప్లాన్ అమలు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని ఇక్రిశాట్‌లో శాస్త్రవేత్తలు, వాతావరణ నిపుణులు, వివిధ శాఖల ఉన్నతాధికారులతో మంత్రి విస్తృత సమీక్ష నిర్వహించారు. జూలై 15, జూలై 30, ఆగస్టు 15 తేదీలను ప్రాతిపదికగా తీసుకుని వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. వర్షాలు ఆలస్యమైనా రైతులకు విత్తనాల కొరత లేకుండా ముందుగానే భారీ స్థాయిలో నిల్వలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. జిల్లాల వారీగా ప్రత్యేక ప్రణాళికలు కూడా సిద్ధంగా ఉంచారు. ప్రస్తుతం - మిగతా3లో

## దేవాదుల పనులు వేగవంతం చేయాలి



- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- రూ.146 కోట్ల విడుదల
- డిసెంబర్ 2027 నాటికి దేవాదుల ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- అన్ని పంపులను 24 గంటలూ నడపాలి
- వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేలా ముందస్తు చర్యలు
- దేవాదుల పూర్తయితే దాదాపు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు
- కాళేశ్వరం బ్యారేజీల విషయంలో ఎన్‌డీఎస్‌ఏ మార్గదర్శకాలే అమలు



## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

- కానీ మాకు డబ్బులివ్వాలి: ట్రంప్
- హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నామన్న ట్రంప్
- ఒప్పందాన్ని ఉల్లంఘించి ఇరాన్ డ్రోన్లు పంపుతోందని ఆరోపణ
- ఇరాన్‌పై రాత్రి సైనిక దాడులు చేశామని వెల్లడి
- జలసంధి భద్రతకు ఇతర దేశాలు డబ్బు చెల్లించాలని డిమాండ్



## 'ఎస్-500' వచ్చేస్తోంది!

- భారత్‌కు రష్యా బంపర్ ఆఫర్..
- ఇక చైనా, పాకిస్తాన్‌కు చుక్కలే..!
- భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం
- దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'



## ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

- పోక్సో దుర్వినియోగంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- ప్రేమలో ఉన్న టీనేజీ యువతపై పోక్సో చట్టం దుర్వినియోగం అవుతుందని సుప్రీంకోర్టు ఆందోళన
- ఆ జంట పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదని ప్రశ్న
- కుటుంబ పరువు కోసం తల్లిదండ్రులు కేసులు పెడుతున్నారని వ్యాఖ్య

# భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం డెడ్‌లాక్ అయ్యిందా?

భారత్-అమెరికా వాణిజ్య చర్చల్లో ప్రతిష్టంభన (డెడ్ లాక్) ఏర్పడిందనే వార్తలను కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ ఖండించారు. "ఆ వార్తలు పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేవి" అని పేర్కొన్నారు. ఇరుదేశాలు పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకునేందుకు కట్టుబడి ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు. అమెరికాతో త్వరగా వాణిజ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి బదులుగా, మరింత మెరుగైన ఒప్పందం కోసం భారత్ చర్చలను ఆలస్యం చేస్తోందని ఒక అంతర్జాతీయ వార్త సంస్థ కథనాన్ని ప్రచురించింది. దీనిన్ని పీయూశ్ గోయల్ ఎక్స్ వేదికగా ఖండించారు. ఆ వార్త పూర్తిగా అవాస్తవం, నిరాధారం, తప్పుదోవ పట్టించేది అని అన్నారు. జూన్ నెలలో యూఎస్ వాణిజ్య ప్రతినిధి (యూఎస్?టీఆర్) జేమీసన్ గ్రీర్ దిల్లీ సందర్శించినప్పుడు ఆయనతో 'ఫెంటాస్టిక్ మీటింగ్స్?' జరిగాయని తెలిపారు. ఇరుదేశాలు సమతుల్యమైన, పరస్పర ప్రయోజనకరమైన వాణిజ్య ఒప్పందాన్ని చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాయని ఆయన పునరుద్ఘాటించారు.

"జూన్ నెలలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమీసర్ గ్రీర్? దిల్లీ వచ్చినప్పుడు ఆయనతో అద్భుతమైన సమావేశాలు జరిపాను. ఇరుదేశాల్లోని వ్యాపారులు, రైతులు, కార్మికులు, వినియోగదారులకు స్పష్టమైన ప్రయోజనాలను అందించే, వాణిజ్యపరంగా అర్థవంతమైన, సమతుల్యమైన ఒప్పందం చేసుకోవాలని నిర్ణయించాం. ఈ లక్ష్యాన్ని సాధించడానికి మా బృందాలు పూర్తి స్థాయిలో కృషి చేస్తున్నాయి" అని గోయెల్ పేర్కొన్నారు. భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందానికి ఎలాంటి అడ్డంకులు లేవని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్ తెలిపిన తర్వాత కేంద్ర మంత్రి పీయూశ్ గోయెల్ ఈ ప్రకటన చేయడం గమనార్హం.



**అంతా ఒక క్రమపద్ధతిలో జరుగుతుంది!**

2026 జూన్? వాణిజ్య గణాంకాలపై మీడియా ప్రతినిధులతో మాట్లాడిన రాజేశ్ అగర్వాల్?, భారత్?-అమెరికా ట్రేడ్ డీల్? చర్చల్లో తమకు ఎలాంటి సవాళ్లు కనిపించలేదని పేర్కొన్నారు. "భారత బృందం మే నెలలో అమెరికాను సందర్శించింది. యూఎస్? బృందం జూన్?లో భారత్?కు వచ్చింది. చర్చలు సరైన పద్ధతిలోనే కొనసాగుతున్నాయి. అమెరికా సుంకాల (టారిఫ్స్?) బాదుడు చర్యలపై చాలా మంది భాగస్వాములకు అనిశ్చితి ఉంది. అయితే ఇప్పుడు ఐఈఈపీఏ సుంకం ముగిసింది. అమెరికా వాళ్లు ఇప్పుడు మళ్లీ ఇతర దేశాలతో చర్చలు జరుపుతున్నారు. భారత్ కూడా ఆ చర్చల్లో భాగస్వామిగా ఉంది. ఈ వాణిజ్య ఒప్పందంపై చర్చలన్నీ సరైన దిశలోనే వెళ్తున్నాయి. ఇప్పటికే డీల్ ఫ్రేమ్?వర్క్? ఖరారైంది. మేము ఈ ట్రేడ్ డీల్?పై సంతకాలు చేయడానికి సిద్ధంగా ఉన్నాం. ఇప్పటికే ప్రాథమిక పనులన్నీ పూర్తయ్యాయి. సరైన సమయం కోసం వేచి చూస్తున్నాం. అన్నీ ఒక క్రమపద్ధతిలో జరుగుతాయి. మేము మంచి పురోగతి సాధిస్తాం. ఈ వాణిజ్య ఒప్పందంపై భారత్?, అమెరికా ప్రభుత్వాలు చాలా సానుకూల ధోరణిని కనబరుస్తున్నాయి" అని వాణిజ్య కార్యదర్శి రాజేశ్? అగర్వాల్? చెప్పారు. ఇప్పటికే ఇరుదేశాల మధ్య ట్రేడ్ ఫ్లో (వాణిజ్యం) బలంగా కొనసాగుతోందని అగర్వాల్ పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా అస్థిరతలు ఉన్నప్పటికీ, వస్తు, ఉత్పత్తుల మార్పిడిలో నిరంతర వేగం కొనసాగుతోందని అన్నారు. అయితే భారత్?-అమెరికా వాణిజ్య ఒప్పందం ఖరారయ్యే తేదీని కానీ , కాలక్రమాన్ని కానీ ఆయన చెప్పలేదు.

**ఒప్పందం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నాం!**

ఇంతకు ముందు భారత్ పర్యటనకు వచ్చిన గోర్? మాట్లాడుతూ, "ఈ వాణిజ్య ఒప్పందం తుది దశలో ఉంది. దాదాపు మొత్తం చర్చలు పూర్తయ్యాయి. కేవలం ఒక శాతం అంశాలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. ఈ చర్చలకు ఎందుకు ఇంత సమయం తీసుకుంటున్నారని చాలా మంది ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి ఇరు దేశాల మధ్య గత రెండు దశాబ్దాలుగా విస్తృత స్థాయిలో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్నాయి. మేము దాదాపు ఏడాదిన్నరగా ఈ ఒప్పందంపై పనిచేస్తున్నాం. దీన్ని విజయవంతంగా ముగించేందుకు మేము కట్టుబడి ఉన్నాం" అని గోర్ అన్నారు.

# ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి పారిపోకుండా ప్రభుత్వం ఎలా ఆపగలదు?

ప్రేమలో ఉన్న అమ్మాయి, అబ్బాయి కలిసి వెళ్లిపోకుండా రాష్ట్రం ఎలా అడ్డుకోగలదని సుప్రీం కోర్టు ప్రశ్నించింది. టీనేజీ వయసులో పరస్పర సమ్మతితో ఏర్పడే ప్రేమ సంబంధాలపై పోక్సో (ౡజుౠ) చట్టం నిబంధనల్ని దుర్వినియోగం చేస్తున్న ఘటనలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. పిల్లలపై లైంగిక దాడులు, లైంగిక దోపిడీని అరికట్టేందుకు తీసుకొచ్చిన చట్టాన్ని ప్రతి టీనేజ్ ప్రేమ వ్యవహారానికి వర్తింపజేయడం సరైందా అనే ప్రశ్నను కూడా లేవనెత్తింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఆర్. మహదేవన్‌లతో కూడిన ధర్మాసనం సోమవారం-యుక్తవయస్కుల గోప్యత హక్కులకు సంబంధించిన సుమోటో కేసు విచారణ సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేసింది. 15 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అత్యంత సున్నితమైన దశ అని, ఈ వయసులో యువతలో సహజంగానే ఆకర్షణలు, భావోద్వేగాలు, ప్రేమ సంబంధాలు ఏర్పడుతుంటాయని కోర్టు పేర్కొంది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు బెంచ్ 'ప్రేమలో ఉన్న ఓ అబ్బాయి, అమ్మాయి కలిసి వెళ్లిపోకుండా ప్రభుత్వం లేదా వ్యవస్థ ఎలా అడ్డుకోగలదు? పిల్లలపై జరిగే లైంగిక దాడులు, దోపిడీని అరికట్టేందుకే పోక్సో చట్టాన్ని తీసుకొచ్చారు. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల మధ్య వయసు అనేది సులభంగా ముప్పునకు లేదా ప్రభావానికి లోనయ్యే వయసు. ప్రయోగాలు చేసే సున్నితమైన దశ. అలాంటప్పుడు ప్రతి ప్రేమ వ్యవహారాన్ని పోక్సో కేసుగా ఎలా మారుస్తారు?' అని అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించింది. 2023లో కలకత్తా హైకోర్టు ఇచ్చిన ఒక వివాదాస్పద తీర్పులో యువతులు తమ లైంగిక కోరికల్ని నియంత్రించుకోవాలని వ్యాఖ్యానించింది. ఈ వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు రావడంతో సుప్రీం కోర్టు 2024లో ఆ తీర్పును రద్దు చేసి, యుక్త వయస్కుల గోప్యత హక్కుల అంశంపై సుమోటో కేసు నమోదు చేసింది. ప్రస్తుతం అదే కేసు విచారణ కొనసాగుతోంది.



**'తల్లిదండ్రులు పరువు కోసం క్రిమినల్ కేసులు పెడుతున్నారు'**

విచారణ సందర్భంగా సీనియర్ న్యాయవాది మాధవి దివాన్ ఈ కేసు నేపథ్యాన్ని వివరించారు. ఒక మైనర్ బాలిక 25 ఏళ్ల వ్యక్తితో స్వచ్ఛందంగా వెళ్లి ప్రస్తుతం అతనితో కలిసి జీవిస్తూ, వారికి ఒక బిడ్డ కూడా ఉన్నట్లు కోర్టుకు తెలిపారు. పోక్సో చట్టం కారణంగా ఇలాంటి సంబంధాల్లో ఉన్న యువకులు జైలుకు వెళ్లాల్సి వస్తోందని ఆమె వాదించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం '16 నుంచి 18 ఏళ్ల మధ్య యువత ప్రేమలో పడి కలిసి వెళ్లిపోతారు. కుటుంబ పరువును కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులు వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. చివరికి కోర్టులు వారిని నిర్దోషులుగా విడుదల చేయాల్సి వస్తోంది' అని వ్యాఖ్యానించింది.

2012లో పోక్సో చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత సమ్మతి వయసును 16 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు పెంచారని సుప్రీం కోర్టు గుర్తు చేసింది. అయితే టీనేజీ ప్రేమ సంబంధాలు 2012 తర్వాత మాత్రమే మొదలయ్యాయని చెప్పలేమని, ఇలాంటి ఘటనలు గతంలో కూడా ఉండేవని పేర్కొంది. బాల్య వివాహాలు కూడా గతంలో సాధారణమేనని ధర్మాసనం గుర్తు చేసింది. అయితే చట్టం మారడంతో ఇప్పుడు అలాంటి సంబంధాలు నేర పరిధిలోకి వచ్చాయని వివరించింది.

**పోక్సో కేసుల పర్యవేక్షణపై సూచనలు**

పోక్సో చట్టం దుర్వినియోగాన్ని అరికట్టేందుకు వ్యవస్థాపరమైన మార్పులు అవసరం అని మాధవి దివాన్ అభిప్రాయ పడ్డారు. పోక్సో చట్టం కింద నమోదయ్యే కేసుల్ని పర్యవేక్షించేందుకు ప్రత్యేక డ్యాష్‌బోర్డ్ ఏర్పాటు చేయాలని సూచించారు. దీనిపై స్పందించిన ధర్మాసనం, ప్రతి హైకోర్టులో ఇప్పటికే బాలల హక్కుల కమిటీలు పనిచేస్తున్నాయని, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా ఈ కేసుల్ని సమర్థవంతంగా పర్యవేక్షించవచ్చని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం కూడా పోక్సో చట్టం అమలుకు సంబంధించి కొన్ని సిఫార్సులు చేసినట్లు కోర్టుకు తెలిపింది. ఈ కేసు తదుపరి విచారణను సుప్రీం కోర్టు జులై 17కు వాయిదా వేసింది.

**బహిరంగ ప్రదేశాల్లో పోర్న్ చూడటంపై నిషేధించాలి!- కోర్టు ఏం చెప్పిందంటే?**

బహిరంగ ప్రదేశాల్లో అశ్లీల (పోర్నోగ్రఫీ) వీడియోలు, కంటెంట్ చూడటాన్ని నిషేధించే విధంగా కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక విధానాన్ని రూపొందించాలని కోరుతూ దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని (ౡ×ౠ) సుప్రీం కోర్టు తిరస్కరించింది. ఈ అంశం న్యాయపరమైనది కాదని, విధానపరమైన నిర్ణయాలకు సంబంధించినదని స్పష్టం చేసింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చి, వి. మోహనలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ఈ అంశం ప్రాధాన్యత కలిగినదేనని అంగీకరించినప్పటికీ, దీనిపై నిర్ణయం తీసుకోవాల్సింది కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ అని పేర్కొంది.

# 'ఎస్-500' వచ్చేస్తోంది..!

భారతదేశ రక్షణ రంగాన్ని మరింత పటిష్టం చేసే దిశగా ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశీయంగా ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర' కోసం రష్యా ఒక అసాధారణమైన ప్రతిపాదనను భారత్ ముందు ఉంచింది. ప్రపంచంలోనే అత్యంత అధునాతన వాయు రక్షణ వ్యవస్థగా పేరొందిన 'ఎస్-500' ఆధారిత సాంకేతికతను భారతదేశంతో కలిసి ఉమ్మడిగా అభివృద్ధి చేయడానికి మాస్కో సిద్ధంగా ఉన్నట్లు రష్యా వర్గాలను ఉటంకిస్తూ 'ఐడిఆర్‌డబ్ల్యూ' పేర్కొంది. నిజానికి ఉక్రెయిన్ సంక్షోభం కారణంగా ఏర్పడిన అంతర్గత భద్రతా అవసరాల దృష్ట్యా, గతంలో ఎస్-500 వ్యవస్థను నేరుగా భారతదేశానికి విక్రయించడానికి రష్యా నిరాకరించింది. అయితే, ప్రస్తుత పరిస్థితుల్లో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తూ, నేరుగా విక్రయించే బదులు.. ఎస్-500 సామర్థ్యాలను భారతదేశంతో కలిసి సంయుక్తంగా అభివృద్ధి చేయడానికి మొగ్గు చూపింది. రష్యా నుంచి వచ్చిన ఈ ప్రతిపాదన భారతదేశపు ప్రస్తుత, భవిష్యత్ బహుళ అంచెల వాయు రక్షణ నిర్మాణాన్ని మరింత శక్తివంతం చేయనుంది.

**ఏమిటీ సుదర్శన్ చక్ర ప్రాజెక్ట్?**

భారతదేశం తన సొంత గగనతల రక్షణ అవసరాల కోసం 'ప్రాజెక్ట్ సుదర్శన్ చక్ర'ను అభివృద్ధి చేస్తోంది. ఇది కేవలం ఒక క్షిపణి వ్యవస్థ మాత్రమే కాదు; సుదూర ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థలు, నిఘా సెన్సార్లు, అత్యాధునిక రాడార్లు, కమాండ్-అండ్-ంట్రోల్ నెట్‌వర్క్‌లను ఒకే గొడుగు కిందకు తెచ్చే ఒక సమీకృత నెట్‌వర్క్. ఇది ఇప్పటికే భారత్ వద్ద ఉన్న రష్యన్ ఎస్-400 వ్యవస్థతో పాటు, స్వదేశీ వాయు రక్షణ ప్రాజెక్ట్ 'కుషా' లతో కలిసి సమన్వయంతో పనిచేస్తుంది.



**తిరుగులేని భారత్ శక్తి**

రష్యాకు చెందిన ఎస్-400 కంటే ఎస్-500 ఎంతో అధునాతనమైనది. ఈ సాంకేతికత తోడైతే, భారత రక్షణ వ్యవస్థ శత్రుదేశాల విమానాలు, క్రూయిజ్ క్షిపణులు, అత్యంత వేగంగా దూసుకొచ్చే హైపర్‌సోనిక్ ఆయుధాలను సైతం గాల్లోనే తుత్తునియలు చేయగలదు. అంతేకాకుండా, మధ్య శ్రేణి బాలిస్టిక్ క్షిపణులను సమర్థవంతంగా అడ్డుకోవడంతో పాటు, కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుల స్టెల్త్ ఫైటర్ జెట్‌లను కూడా ఇది గుర్తించి కూల్చివేయగలదు.

**వ్యూహాత్మక ప్రాధాన్యత -- టెక్నాలజీ బదిలీ**

బాలిస్టిక్ క్షిపణులను ఎదుర్కొనేందుకు భారత్ ఇప్పటికే స్వంత మార్గసూచితో బాలిస్టిక్ క్షిపణి రక్షణ ఫేజ్-× ను మోహరించింది. ఇది అంతరిక్షం వెలుపల, వాతావరణం లోపల వచ్చే క్షిపణులను అడ్డుకుంటుంది. ఇలాంటి తరుణంలో రష్యా ప్రతిపాదన భారత్‌కు అత్యంత కీలకం కానుంది. ఎందుకంటే, ఈ ప్రతిపాదన కేవలం ఆయుధాల కొనుగోలుకు పరిమితం కాకుండా, అత్యంత కీలకమైన సాంకేతిక పరిజ్ఞాన బదిలీకి ప్రాధాన్యత ఇస్తుంది.

**చిరకాల మైత్రికి నిదర్శనం**

ఒకప్పుడు కేవలం ఆయుధాల విక్రయదారుడిగా ఉన్న రష్యా, ఇప్పుడు భారతదేశపు సమీకృత వాయు, క్షిపణి రక్షణ వ్యవస్థలో ఒక ప్రధాన భాగస్వామిగా మారడానికి సిద్ధపడటం ఇరు దేశాల చిరకాల మైత్రికి, వ్యూహాత్మక బంధానికి నిదర్శనంగా నిలుస్తోంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్ట్ కార్యరూపం దాల్చితే భారత గగనతలం వైపు కన్నెత్తి చూడటానికి కూడా శత్రుదేశాలు వణకక తప్పదు.

## ఇక హర్మూజ్ జలసంధిని మేమే నడిపిస్తాం..

అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర పరిణామాలకు దారితీసే విధంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. కీలకమైన హర్మూజ్ జలసంధిని అమెరికా తన నియంత్రణలోకి తీసుకుంటుందని, ఇకపై దాని భద్రతను శాశ్వతంగా పర్యవేక్షిస్తుందని సోమవారం స్పష్టం చేశారు. ఇరాన్ ఒక సైనిక ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఈ వ్యూహాత్మక జలమార్గంలోకి డ్రోన్లను పంపడమే ఇందుకు కారణమని ఆయన ఆరోపించారు. ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ట్రంప్ మాట్లాడుతూ, "మేం హర్మూజ్ జలసంధిని స్వాధీనం చేసుకుంటున్నాం. ఇక వాళ్ల దగ్గర ఏమీ లేదు" అని వ్యాఖ్యానించారు. ఇరాన్‌కు చెందిన సైనిక ఆస్తులే లక్ష్యంగా నిన్న రాత్రి అమెరికా దాడులు చేసిందని, డ్రోన్ల కార్యకలాపాలు కొనసాగితే ఇలాంటి దాడులు మరిన్ని ఉంటాయని ఆయన తీవ్రంగా హెచ్చరించారు. "నిన్న రాత్రి వారిపై తీవ్రంగా దాడులు చేశాం. వాళు డ్రోన్ పంపిన ప్రతిసారీ మేం గట్టిగా బదులిస్తాం. వారి యాంటీ-ఎయిర్‌క్రాఫ్ట్ గన్‌తో సహా చాలా పరికరాలు ధ్వంసమయ్యాయి" అని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌తో సుదీర్ఘ చర్చల అనంతరం ఒక ఒప్పందం కుదిరిందని, అయితే చివరి నిమిషంలో ఇరాన్ ప్రతినిధులు మార్పులు కోరడంతో అది విఫలమైందని ట్రంప్ వెల్లడించారు. "మా మధ్య ఒక డీల్ కుదిరింది. 11 గంటల సమావేశం తర్వాత వాళ్లు అన్నింటికీ ఒప్పుకున్నారు. కానీ తర్వాత ఫోన్ చేసి మార్పులు కోరారు. అందుకే మేం ఆ ఒప్పందాన్ని పక్కనపెట్టాం" అని వివరించారు. ఇకపై హర్మూజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికానే తీసుకుంటుందని, అవసరమైతే తామే దాన్ని నడిపిస్తామని ట్రంప్ పేర్కొన్నారు. "ఈ జలసంధికి మేం సంరక్షకులుగా మారతాం" అని ఆయన వ్యాఖ్యానించారు. అయితే, ఈ భద్రతను ఉచితంగా అందించబోమని, ఈ మార్గం ద్వారా లబ్ధి పొందుతున్న సంపన్న దేశాలు అమెరికాకు అందుకు అయ్యే ఖర్చును చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. "మా సైనికులను ప్రమాదంలోకి నెట్టి భద్రత కల్పిస్తున్నందుకు మాకు డబ్బు చెల్లించాలి" అని ట్రంప్ స్పష్టం చేశారు. పర్షియన్ గల్ఫ్‌ను అరేబియా సముద్రంతో కలిపే హర్మూజ్ జలసంధి, ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైనది. గల్ఫ్ దేశాల నుంచి భారత్ సహా ఇతర ఆసియా దేశాలకు చమురు, గ్యాస్ ఎగుమతులు ఈ మార్గం గుండానే జరుగుతాయి.

## ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ షాక్..

జమ్మూకశ్మీర్‌లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ, ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీసును జారీ చేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది. ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు. సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలక పాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు.

**నోటీసులో బీజేపీ డిమాండ్లు**

ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొంది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్ పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొంది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది.

**చర్యలకు సిద్ధమన్న బీజేపీ**

గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టం చేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

## ప్రపంచ నేతలే లక్ష్యంగా ఇరాన్ హిట్‌లిస్ట్..?



ఇరాన్‌లో ఓ ప్రముఖ వార్తాపత్రిక ప్రచురించిన కథనం అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. ఇరాన్ దివంగత మాజీ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు ప్రతీకారంగా అమెరికా, ఇజ్రాయెల్, యూరప్ దేశాల అధినేతలే లక్ష్యంగా ఒక 'హిట్‌లిస్ట్'ను ఆ పత్రిక విడుదల చేసింది. రాజధాని టెహ్రాన్ అధికార వర్గాల ఆధ్వర్యంలో నడిచే 'హమ్‌షహ్రీ' అనే వార్తాపత్రిక 13 మంది విదేశీ నేతల ఫొటోలతో కూడిన ఒక ఇన్ఫోగ్రాఫిక్‌ను నిన్న రాత్రి ఆన్‌లైన్‌లో ప్రచురించింది. ఇది ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఫిబ్రవరి 28న మధ్యప్రాచ్య యుద్ధం మొదటి రోజున అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఆయన తర్వాత సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన కుమారుడు మొజ్తబా ఖమేనీ ప్రతీకార ప్రతిజ్ఞ చేశారు. "ప్రతీకారం తీర్చుకోవడం మా జాతి సంకల్పం. అది కచ్చితంగా నెరవేరుతుంది. జాబితాలో పేర్లున్న ఈ నేరస్థులు.. మంచం మీదే ప్రశాంతంగా చనిపోవాలన్న కోరికను తమతో పాటే సమాధిలోకి తీసుకువెళతారు" అని తన తండ్రి అంత్యక్రియల తర్వాత మొజ్తబా హెచ్చరించారు. అయితే, ఆయన తన సందేశంలో ఎవరి పేర్లనూ బయటపెట్టలేదు. 'హమ్‌షహ్రీ' పత్రిక విడుదల చేసిన జాబితాలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు, బ్రిటన్ ఆపద్ధర్మ ప్రధాని కీర్ స్టార్మర్, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మెక్రాన్, ఇటలీ ప్రధాని జార్జియా మెలోనీ, జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడ్రిక్ మెర్జ్‌ల పేర్లు ఉన్నాయి. వీరితో పాటు అమెరికా విదేశాంగ కార్యదర్శి మార్కో రూబియో, రక్షణ కార్యదర్శి పీట్ హెగ్సెత్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. అయితే, పత్రిక ప్రింట్ ఎడిషన్‌లో ఈ జాబితా కనిపించకపోవడం గమనార్హం. ఇది కేవలం పత్రిక ప్రచురించిన జాబితానే తప్ప, ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది కాదని తెలుస్తోంది. యుద్ధ సమయంలో తమ భూభాగంపై జరిగిన దాడులను ఖండించడంలో యూరప్ దేశాలు విఫలమయ్యాయని, అమెరికా సైనిక విమానాలకు తమ గగనతలాన్ని ఉపయోగించుకునేందుకు అనుమతినిచ్చి ఆ నేరంలో పాలుపంచుకున్నాయని ఇరాన్ ఆరోపిస్తోంది. ఇదిలా ఉండగా, యుద్ధానికి ముందు నుంచే కనిపించకుండా పోయిన మొజ్తబా ఖమేనీ.. తన తండ్రిపై జరిగిన దాడుల్లో గాయపడినట్లు వార్తలు వస్తున్నాయి.

# ఎల్-నినో ముప్పుకు చెక్ పెట్టేలా యాక్షన్ ప్లాన్

-మొదటిపేజీ తరువాయి

రాష్ట్రంలో కొన్ని జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవుతుండగా, మరికొన్ని జిల్లాల్లో లోటు కనిపిస్తున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్లు, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి సూచించారు. పరిస్థితులను బట్టి వెంటనే చర్యలు చేపట్టేలా జిల్లా యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

**ప్రతి వారం మండలాల వారీగా ప్రత్యేక బులెటిన్**

ఎల్-నినో పరిస్థితులపై రైతులకు ఖచ్చితమైన సమాచారం అందించేందుకు ప్రతి వారం మండలాల వారీగా వ్యవసాయ--వాతావరణ బులెటిన్ విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో వర్షపాతం, ఉష్ణోగ్రతలు, నేల తేమ, భూగర్భ జలాల స్థితి, సాగునీటి లభ్యత, విద్యుత్ సరఫరా, పంటల పరిస్థితి, రైతులు తీసుకోవాల్సిన యాజమాన్య చర్యలు వంటి అంశాలు పొందుపరుస్తారు.

**శాస్త్రవేత్తల సూచనలు రైతుల వద్దకే**


వర్షాలు పడిన తర్వాతే విత్తనాలు వేయడం, నేల తేమను కాపాడే పద్ధతులు పాటించడం, సరైన సమయంలో ఎరువులు వినియోగించడం, తక్కువ నీటితో సాగు చేసే విధానాలను అమలు చేయడం వంటి శాస్త్రీయ సూచనలను ప్రతి రైతుకు చేరవేయాలని మంత్రి ఆదేశించారు. వ్యవసాయ అధికారులు గ్రామాల వారీగా రైతులకు ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నారు.

**వరి రైతులకు ప్రత్యేక మార్గదర్శకాలు**

వరి సాగు చేస్తున్న రైతులు నారు నిర్వహణ, నాటే దూరం, ఎరువుల వినియోగం, నీటి పొదుపు పద్ధతులపై శాస్త్రవేత్తలు సూచించిన మార్గదర్శకాలను పాటించాలని సూచించారు. ఇంకా నారు వేయని రైతులు తక్కువ కాలంలో పండే రకాలతో పాటు ప్రత్యామ్నాయ సాగు పద్ధతులను పరిశీలించాలని తెలిపారు.

**ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి**

నీటి లభ్యత తక్కువగా ఉండే ప్రాంతాల్లో వరికి బదులుగా మొక్కజొన్న, సజ్జలు, రాగులు, కందులు, మినుములు, నువ్వులు, పొద్దుతిరుగుడు, అలసందలు, కూరగాయల సాగును ప్రోత్సహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక రైతులకు మేలు చేస్తుందని అధికారులు సూచించారు.



**మొక్కజొన్న, పత్తి రైతులకు అప్రమత్తత**

ఇప్పటికే మొలక దశలో ఉన్న మొక్కజొన్న, పత్తి పంటలకు వచ్చే రెండు వారాలు కీలకమని నిపుణులు చెబుతున్నారు. వర్షాభావం కొనసాగితే నేల తేమను కాపాడేందుకు కలుపు నియంత్రణ, తేమ సంరక్షణ చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని సూచించారు.

**విత్తనాలు, ఎరువుల కొరత ఉండదని భరోసా**

మూడు దశల కార్యాచరణకు అనుగుణంగా అవసరమైన విత్తనాలు, ఎరువులపై ముందుగానే అంచనాలు పూర్తి చేసి నిల్వలు సిద్ధం చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. మార్క్‌ఫెడ్, విత్తన సంస్థలు, జిల్లా యంత్రాంగం సమన్వయంతో రైతులకు ఎలాంటి కొరత రాకుండా చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి వెల్లడించారు.

**'రైతు నేస్తం'లో ఎల్-నినోపై ప్రత్యేక అవగాహన**

రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ఎల్-నినో ప్రభావాలు, నీటి యాజమాన్యం, నేల తేమ సంరక్షణ, ప్రత్యామ్నాయ సాగు, వాతావరణ ఆధారిత వ్యవసాయ పద్ధతులపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. ప్రతి రైతు పరిస్థితులకు అనుగుణంగా సరైన నిర్ణయాలు తీసుకునేలా వ్యవసాయ శాఖ మార్గనిర్దేశం చేయనుంది.

**రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

ఎల్-నినో ప్రభావం ఎంత తీవ్రంగా ఉన్నా రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. శాస్త్రవేత్తల సూచనలు క్షేత్రస్థాయిలో అమలయ్యేలా జిల్లా యంత్రాంగానికి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

# దేవాదుల పనులు వేగవంతం చేయాలి

**హైదరాబాద్ :** రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్న నేపథ్యంలో తాగునీరు, సాగునీటి అవసరాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవాదుల ఎత్తిపోతల పథకంలోని అన్ని పంపులను నిరంతరం 24 గంటల పాటు నిర్వహించాలని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు పరిధిలోని 22 రిజర్వాయర్లను పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యంతో నింపి నీటి భద్రతను కల్పించాలని స్పష్టం చేశారు. సోమవారం ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ--గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో కలిసి దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన మంత్రి, అనంతరం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రాజెక్టు మూడో దశ పనులను వేగవంతం చేయడంపై అధికారులకు స్పష్టమైన కార్యాచరణను సూచించారు. ప్రస్తుతం గోదావరి నదిలో సుమారు 20 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం ఉన్నందున ఈ అవకాశాన్ని పూర్తిగా వినియోగించుకోవాలని మంత్రి ఆదేశించారు. ప్రస్తుతం ఏడు పంపులు పనిచేస్తూ తాగునీరు, సాగునీటి అవసరాలకు నీటిని ఎత్తిపోస్తున్నాయని అధికారులు వివరించారు. మొత్తం పది పంపులు పనిచేస్తే రోజుకు 0.23 టీఎంసీల నీటిని ఎత్తిపోసే సామర్థ్యం ఉండగా, సుమారు నాలుగున్నర రోజుల్లో ఒక టీఎంసీ నీటిని తరలించవచ్చని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరిలో ప్రవాహం ఉన్నప్పుడల్లా గరిష్ట స్థాయిలో నీటిని ఎత్తిపోసి రిజర్వాయర్లను నింపాలని మంత్రి స్పష్టం చేశారు.

గోదావరిలోని ఇంటేక్ నిర్మాణాలు, భారీ పంప్ హౌస్‌లు, రైజింగ్ మెయిన్లు, బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, గ్రావిటీ కాలువల పనులను సమీక్షించిన ఉత్తమ్ కుమార్ రెడ్డి, దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేయడం ప్రభుత్వ లక్ష్యమని పునరుద్ఘాటించారు.

మూడు దశల పనులు పూర్తయినప్పుడే ప్రాజెక్టు పూర్తి ప్రయోజనాలు రైతులకు అందుతాయని, ఒక్క ఎకరం కూడా మిగలకుండా ఆయకట్టుకు నీరందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రతి ప్యాకేజీకి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి నెలవారీగా పురోగతిని సమీక్షించాలని



ఇంజినీర్లకు ఆదేశించారు.

పనులకు ఆటంకంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని, భూసేకరణ, చట్టపరమైన అనుమతులు, ఇతర క్లియరెన్సులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన చోట అదనపు యంత్రాలు, సిబ్బందిని నియమించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టు పనులకు నిధుల కొరత ఉండదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేస్తూ, వెంటనే రూ.146 కోట్లను విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. నిర్ణీత గడువులోగా ప్రాజెక్టు పూర్తి చేయడానికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని చెప్పారు. దేవాదుల ఎత్తిపోతల పథకం పూర్తయిన అనంతరం ములుగు, జయశంకర్ భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, జనగాం, సిద్ధిపేట, కరీంనగర్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట జిల్లాల్లో దాదాపు 5.6 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. ఉత్తర తెలంగాణలోని అనేక గ్రామాలకు తాగునీటి సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై మాట్లాడిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించిన తుది డిజైన్లకు ఆమోదం లభించిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. జాతీయ ఆనకట్టల భద్రతా సంస్థ (ఎన్‌డీఎస్‌ఏ) సూచనల మేరకే బ్యారేజీల నిర్వహణ ఉంటుందని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టు ప్రభుత్వ అత్యున్నత ప్రాధాన్య కార్యక్రమాల్లో ఒకటని, అవసరమైన నిధుల విడుదలకు ఎల్లప్పుడూ ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు. రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణను వేగవంతం చేశామని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడానికి కృషి చేస్తున్నాయని తెలిపారు. దేవాదుల ఎత్తిపోతల పథకం మొత్తం 16 ప్యాకేజీలతో మూడు దశల్లో అమలవుతోందని మంత్రి వివరించారు. మొదటి దశలో 1.23 లక్షల ఎకరాలు, రెండో దశలో 1.93 లక్షల ఎకరాలు, మూడో దశలో 2.39 లక్షల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. ఈ ప్రాజెక్టులో 642 కిలోమీటర్ల పైప్‌లైన్లు, 57.16 కిలోమీటర్ల సొరంగ మార్గాలు, 306 కిలోమీటర్ల ప్రధాన కాలువలు, 2,185 కిలోమీటర్ల పంపిణీ కాలువల నిర్మాణం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆసియాలోనే అత్యంత పొడవైన 49 కిలోమీటర్ల 'డి' ఆకారపు సాగునీటి సొరంగం ఈ ప్రాజెక్టులో భాగమని ఆయన పేర్కొన్నారు. ప్రాజెక్టుకు అవసరమైన 495.55 మెగావాట్ల విద్యుత్ సరఫరాకు ఏర్పాట్లు జరుగుతున్నాయని, భవిష్యత్తులో సమ్మక్క బ్యారేజీతో అనుసంధానం ద్వారా ఏడాది పొడవునా నీటి లభ్యత మరింత మెరుగుపడుతుందని చెప్పారు. ప్రస్తుతం దేవాదుల ప్రాజెక్టు భౌతిక పురోగతి 87.70 శాతానికి చేరుకుందని ఆయన తెలిపారు. పంప్ హౌస్‌లు, పైప్‌లైన్లు, సొరంగ తవ్వకాల వంటి ప్రధాన నిర్మాణాలు పూర్తయ్యాయని, కాలువల లైనింగ్, పంపిణీ కాలువలు, కొన్ని కీలక నిర్మాణాలు, పెండింగ్ భూసేకరణ పూర్తయిన వెంటనే ప్రాజెక్టు పూర్తి స్థాయిలో రైతులకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొదటి దశలోని ప్యాకేజీ--45 పూర్తిగా పూర్తికాగా, ప్యాకేజీ--46 పనులు 96.86 శాతం పూర్తయ్యాయని అధికారులు వెల్లడించారు. ఈ సమీక్ష సమావేశంలో ఇంజినీర్-ఇన్-చీఫ్ (జనరల్) రమేష్ బాబు, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు, సీనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు. నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కార్యాలయం నుండి విడుదల చేయడమైనది

# ఫ్లడ్.. బ్లడ్.. పీక్స్‌కు చేరిన కాళేశ్వరం వార్!

**హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య రాజకీయ పోరు మరింత వేడెక్కింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్‌ఎస్ రక్తదాన శిబిరం నిర్వహించగా.. దీనికి కౌంటర్‌గా కాంగ్రెస్ 'అవినీతి కాళేశ్వరం' పేరుతో ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. దీంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ఇటు తెలంగాణ భవన్, అటు గాంధీభవన్ వద్ద భారీగా పోలీసులు మోహరించాల్సి వచ్చింది. సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో పీవీ నరసింహారావు మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో బీఆర్‌ఎస్వీ.. 'రేవంత్ రక్తదాహానికి రక్తదానం' అనే నినాదంతో బ్లడ్ డొనేషన్ క్యాంప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు నేతలు.. ప్రభుత్వ రాజకీయ కక్షసాధింపులో భాగంగానే కాళేశ్వరం అంశాన్ని వాడుకుంటోందని మండిపడ్డారు. ప్రజల దృష్టి మరల్చేందుకే సీఎం ఇటువంటి వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. సేకరించిన రక్తపు ప్యాకెట్లతో.. సీఎం రేవంత్ నివాసానికి వెళ్లి నిరసన తెలుపుతామని బీఆర్‌ఎస్వీ నేతలు అంటున్నారు. దీంతో తెలంగాణ భవన్ బయట భారీగా పోలీసులు మోహరించారు. ఇక.. మరోవైపు అధికార కాంగ్రెస్ కూడా అదే స్థాయిలో ఎదురుదాడికి దిగింది. గాంధీభవన్‌లో 'అవినీతి కాళేశ్వరం' పేరుతో కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటాన్ని ప్రదర్శించింది. ప్రాజెక్టు లోపాలు అంటూ పలు చిత్రాలను ప్రదర్శిస్తోంది. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవినీతి జరిగిందని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. ఈ వ్యవహారంలో



బాధ్యులపై చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కాళేశ్వరం అంశాన్ని ఇరు పార్టీలు రాజకీయ ఆయుధంగా మార్చుకోవడంతో రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒకవైపు బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తోందని కాంగ్రెస్ ఆరోపిస్తుండగా.. మరోవైపు రాజకీయ కక్షతోనే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని బీఆర్‌ఎస్ ఎదురుదాడి చేస్తోంది. దీంతో కాళేశ్వరం వ్యవహారం చుట్టూ అధికార, ప్రతిపక్షాల మధ్య రాజకీయ పోరు మరింత ఉధృతమవుతోంది.

## మూసీ పునరుజ్జీవానికి కేంద్రం నిధులు

-మొదటిపేజీ తరువాయి

వరంగల్ విమానాశ్రయాలు త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు. కేంద్రం సహకరిస్తే ఒప్పుకునేందుకు ఎలాంటి భేషజాలు లేవని స్పష్టం చేశారు. గోదావరి, కావేరి అనుసంధానంతో రాష్ట్రానికి ప్రయోజనం ఉంటుందని, 120 టీఎంసీలకు కేంద్రం అనుమతులు వస్తే ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేసుకోవచ్చని వెల్లడించారు. కేంద్రం నుంచి సాధించాల్సిన అంశాలపై ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేశారు.

**అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలి**

పలు జాతీయ రహదారులకు అనుమతులు, నిధులు, ఇతర అనుమతుల సాధనలో పెండింగ్‌లో ఉన్న అంశాలను ఎంపీలకు వివరించినట్లు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వ శాఖల వారీగా ఎంపీ అందజేసే అంశాలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయనే సమాచారాన్ని సిద్ధం చేసి ఎంపీలకు ఇప్పటికే అందజేశారు. వాటిపై ఇప్పటికే సీఎం, మంత్రులు ఢిల్లీకి వెళ్లి అనేకసార్లు విజ్ఞప్తి చేసినందున అనుమతులు, నిధులు రావడానికి కృషి చేయాలని ఎంపీలకు సీఎం దిశానిర్దేశం చేసినట్లు తెలుస్తోంది.

## తెలంగాణలో మళ్లీ ఎండాకాలం!

-మొదటిపేజీ తరువాయి

పాటు తెలంగాణలో వర్షాలు కురవకపోగా ఎండల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుతం నమోదవుతున్న గరిష్ట ఉష్ణోగ్రతలు మరో ఒకటి రెండు డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని వెల్లడించారు. రాగల 5,6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదని స్పష్టం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో నెలకొన్న తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నాయని, ఈ సీజన్‌లో ఇప్పటి వరకు 30 శాతంపైగా లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు.

**ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి**

తెలంగాణ రాష్ట్రంలో జులై 2వ వారంలో మంచిగా వర్షాలు పడే సమయమని, కానీ వానలు కురవకపోయిన క్లౌడింగ్ ఉందని, ఈ సమయంలో 30 నుంచి 32 డిగ్రీల ఉష్ణగ్రత ఉండే అవకాశం ఉంటుందని శ్రీనివాస్ రావు తెలిపారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంతో మొదట వారంలో ఈదురుగాలులు వీచాయని, ప్రస్తుతం తగ్గుముఖం పట్టాయని, క్లౌడినెస్? కూడా లేదని చెప్పారు. దీంతో గత నాలుగు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయని, 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతుందని, ప్రస్తుతానికి హెచ్చరికల స్థాయికి ఉష్ణోగ్రతలు పెరగలేదని వెల్లడించారు. వర్షాలు కురవకపోవడానికి ఎల్?నినో ప్రభావం అని కూడా చెప్పవచ్చని, కొన్ని ప్రదేశాల్లో వర్షాలు విపరీతంగా కురిశాయని, కొన్ని చోట్ల వానలు పడలేదని, ఈ లక్షణాలు ఎల్?నినోకే ఉంటాయని పేర్కొన్నారు. "గత పది రోజులు క్రితం పశ్చిమ తీరంలో అధికంగా వర్షాలు పడ్డాయి. వాయు బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి ఒడిస్సా ప్రాంతంలో కూడా వర్షాలు కురిశాయి. తెలంగాణలో ఈదురుగాలులు కొనసాగాయి. వర్షాలు అప్పటి నుంచి పడలేదు. జూన్ ఆఖరి వారం నుంచి వానలు లేవు. ఈదురు గాలులు వేగం కూడా తగ్గింది. కొన్ని జిల్లాల్లో మాత్రం ఈదురుగాలులు కొనసాగుతున్నాయి. తెలంగాణ వాతావరణ పరిస్థితుల కారణంగా అక్కడక్కడ చిన్నపాటి చినుకులు పడుతున్నాయి. రాగల 5,6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం లేదు"

## సత్ఫలితాలిస్తున్న నిపుణ్ భారత్ మిషన్...

**తెలంగాణలో మెరుగైన విద్యా ప్రమాణాలు**

జాతీయ విద్యా విధానం (ఎన్ ఈపీ) 2020, భారతదేశ విద్యా సంస్కరణల అజెండాలో మౌలిక బాష, గణిత సామర్థ్యాలకు (ఎఫ్ఎల్ఎన్) కేంద్ర స్థానం కల్పించింది. దీని ప్రకారం.. మూడో తరగతి చదివే విద్యార్థి.. అతనికి ఇచ్చిన పాఠ్యాంశాలను అర్థవంతంగా చదవడం, ప్రాథమిక గణిత లెక్కలు చేయగలగడం అనేది చాలా ముఖ్యమని స్పష్టంగా చెప్పింది. ఇది ఆ విద్యార్థి తర్వాత తరగతుల్లో జీవితంలో వచ్చే ప్రతి అభ్యసన దశను తీర్చిదిద్దుతుందని గుర్తించిన విద్యా మంత్రిత్వ శాఖ జూలై 2021లో 'నిపుణ్ భారత్ మిషన్'ను ప్రారంభించింది. ఇది పాఠ్యప్రణాళిక, ఉపాధ్యాయుల సామర్థ్యం, మూల్యాంకనం, తల్లిదండ్రుల భాగస్వామ్యం, డేటా ఆధారిత పాలన వంటి అంశాలను కలుపుకొని పనిచేసే ఒక సమగ్ర విధానం. ప్రతి బిడ్డ ప్రాథమిక అభ్యసన మైలురాళ్లను సాధించేలా చూడటమే దీని లక్ష్యం. తెలంగాణలో, ఈ జాతీయ విధానం విద్యా సంస్కరణలకు అద్భుతమైన చోదక శక్తిగా నిలిచింది. దీని ఫలితంగా 24,000 ప్రభుత్వ పాఠశాలల్లో 10.34 లక్షల మంది విద్యార్థులకు ఎఫ్ఎల్ఎన్ గ్రేడ్‌లు అందాయి. ఈ సంస్కరణలకు 60,000 మంది ప్రాథమిక తరగతి ఉపాధ్యాయులు సహకారం అందించారు. ఇప్పుడు తెలంగాణ రాష్ట్ర విద్యా గణాంకాలలో ఈ ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత 2024--25 , 2025--26 విద్యా సంవత్సరాల మధ్య, తెలుగు వాక్య పఠన స్కోర్లు 6 శాతం పాయింట్లు, ఆంగ్లంలో 9 పాయింట్లు, గణిత కూడిక--తీసివేత స్కోర్లు 8 పాయింట్లు పెరిగాయి.

**తనిఖీ తంతుకు చెల్లుచీటీ...**

గత 2022 వరకు తెలంగాణలో పాఠశాలల సందర్శనలు కేవలం తనిఖీ తంతులా సాగేవి. బోధన--అభ్యసన సామగ్రిని గానీ, బోధనా నాణ్యతను గానీ క్రమపద్ధతిలో పర్యవేక్షించేవారు కాదు. సమీక్షా సమావేశాలు పరిపాలనాపరమైన ఆదేశాలు జారీ అయ్యేవి కానీ, అభ్యసన ఫలితాలపై అరుదుగా మాత్రమే చర్చించేవి. అంతేకాకుండా, విడివిడిగా ఉన్న డేటా వ్యవస్థల వల్ల, తరగతి గదుల్లో వాస్తవంగా ఏం జరుగుతుందో ఎవరికీ తెలిసే అవకాశం ఉండేది కాదు.

**కొత్తగా...నిర్మాణాత్మకంగా...**

కొత్తగా చేపట్టిన చర్యల్లో కీలకమైనది పాఠశాల పర్యవేక్షణలో గతంలో విడివిడిగా ఉన్న మూడు విభాగాలైన సందర్శనలు, సమీక్షలు, డేటాను ఒకే అనుసంధానిత పరిపాలనా వ్యవస్థగా మార్చడం. దీని ద్వారా పాఠశాలల సందర్శనలను పరిపాలనా తనిఖీల నుంచి క్రమబద్ధమైన మార్గదర్శక కార్యక్రమాలుగా పునఃరూపకల్పన చేశారు. క్లస్టర్ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ప్రతి స్థాయిలోని అధికారులు ఇప్పుడు తెలంగాణ పాఠశాల విద్యా అప్లికేషన్ లో నేరుగా నమోదు చేసిన ఒకే ఉమ్మడి పరిశీలన సాధనాన్ని ఉపయోగిస్తున్నారు. సందర్శన జరిగిందా లేదా అనే దానితో పాటు, వాస్తవంగా ఏం గమనించారు? దానిపై తదుపరి చర్యలు ఏం తీసుకున్నారు అనే దాని ఆధారంగా సందర్శన నాణ్యతను అంచనా వేస్తున్నారు.

**డిజిటల్ ఆధారిత పర్యవేక్షణ..**

పరిపాలనా బులెటిన్ లకు బదులుగా, పర్యవేక్షణ డాష్‌బోర్డ్‌ల నుండి లభించే ప్రత్యక్ష డేటా ఆధారంగా ఎస్ఇఆర్‌టి రూపొందించిన, అభ్యాసంపై దృష్టి సారించి నిర్దిష్ట ఎజెండాలతో నెలవారీ సమీక్షా సమావేశాలను తప్పనిసరి చేశారు. ఈ రెండింటికీ ఆధారం ఐదు ప్లాట్ ఫారమ్‌లతో కూడిన డిజిటల్ నిర్మాణం ఇంటిగ్రేటెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ పోర్టల్, తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ అప్లికేషన్, ట్రాకింగ్, ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, విద్యా సమీక్షా కేంద్రం (విఎస్‌కె) పర్యవేక్షణ కేంద్రం ఇది 33 జిల్లాలన్నింటిలోనూ ఒకే, నిజ--సమయ ప్రామాణిక సమాచార వనరుగా ప్రత్యక్షంగా పనిచేస్తోంది. విఎస్‌కె సిబ్బంది ఈ డాష్‌బోర్డ్‌లను నిరంతరం పర్యవేక్షిస్తూ, లోపాలను గుర్తించి, నేరుగా తదుపరి చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో, 2,100 మందికి పైగా అధికారులు ఇప్పుడు పర్యటనలు నిర్వహిస్తూ, బ్లాక్ , క్లస్టర్ సమీక్షలను సులభతరం చేస్తున్నారు. ఇంకా, 100 మందికి పైగా సీనియర్ అధికారులు ఇదే ప్రత్యక్ష డేటాను ఉపయోగించి రాష్ట్ర , జిల్లా సమావేశాలకు అధ్యక్షత వహిస్తున్నారు.

**ఫలితాలు సుస్పష్టం...**

మొత్తంగా విద్యా వ్యవస్థలో చేపట్టిన సంస్కరణల ఫలితాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గత 2025--26 విద్యా సంవత్సరంలో అధికారుల స్కూల్ విజిట్స్ 2.5 రెట్లు పెరిగి 1.5 లక్షలకు పైగా చేరాయి, ప్రతి త్రైమాసికంలో 98% పాఠశాలలను సందర్శిస్తున్నారు. ఇప్పుడు బోధనా--అభ్యసన సామగ్రి విద్యా సంవత్సరం మొదటి నెలలోనే 90% కంటే ఎక్కువ మంది విద్యార్థులకు చేరుతోంది. సమీక్షా సమావేశాలు మరింత క్రమబద్ధంగా మారాయి. సెంట్రల్ స్క్వేర్ ఫౌండేషన్ సాంకేతిక సహకారంతో తెలంగాణ ఎస్‌సిఇఆర్‌టి 33 జిల్లాల వ్యాప్తంగా 2వ తరగతి పిల్లలకు వార్షిక నమూనా--ఆధారిత మూల్యాంకనాన్ని ఏర్పాటు చేసింది. గత 2022--23 విద్యా సంవత్సరం నుంచి ఏటా నిర్వహిస్తున్న ఈ మూల్యాంకనం, ప్రస్తుతం 1,750కి పైగా పాఠశాలల్లోని సుమారు 8,500 మంది పిల్లలను కవర్ చేస్తోంది.

## సంపాదకీయం

# డిఫెన్స్ రంగంలోకి భారత్


వాస్తవానికి ప్రపంచ ఆర్థిక శక్తిగా అమెరికా ఉంది. తర్వాత స్థానంలో చైనా ఉంది. రష్యా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కానీ ఈ జాబితాలో ఇండియా వచ్చి చేరింది. ఆర్థికంగా బలోపేతమైన స్థానంలో ఉంది. ఇప్పుడు డిఫెన్స్ రంగంలో కూడా భారత్ సరికొత్త చరిత్ర సృష్టిస్తోంది. ఏకంగా చైనా కు దిమ్మ తిరిగే విధంగా షాకిచ్చింది.కొంతకాలం గా డిఫెన్స్ రంగంలో భారత్ అనేక రకాలుగా ప్రయోగాలు చేస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను రూపొందిస్తుంది. వివిధ దేశాలతో ఒప్పందాలు కూడా కుదుర్చుకుంటున్నది. తన ఆయుధ శక్తిని ఇటీవల కాలంలో ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ప్రదర్శించింది. పాకిస్తాన్ లో ఉగ్రవాద శిబిరాల మీద దాడులు చేసింది. ఖచ్చితమైన లక్ష్యాల మీద దాడులు చేసి భారత్ తన స్థాయిని నిరూపించుకుంది. అయితే ఇక్కడితోనే భారత్ ఆగిపోవడం లేదు. ఏకంగా ప్రపంచ ఆయుధ శక్తులుగా వెలుగొందుతున్న అమెరికా, రష్యా తర్వాత భారత్ స్థానాన్ని సంపాదించుకుంది. భారతస్థాయిని డబ్ల్యూడిఎంఎంఏ సంస్థ తన వార్షిక ర్యాంకింగ్ ల ద్వారా ప్రకటించింది. ఈ జాబితాలో భారత్ మూడో స్థానంలో ఉండడం విశేషం. ఆధునికీకరణ.. లాజిస్టికల్ మద్దతు.. పరస్పరంగా చేసే దాడులు.. రక్షణ సామర్థ్యాలు వంటి ఆధారంగా ఈ రేటింగ్ ఇచ్చింది. ప్రత్యేకమైన మిషన్, ప్రత్యేకమైన బాంబర్ దళం, సిఏఎస్ శిక్షణ.. వంటి వాటిని డబ్ల్యూ డి ఎం ఎం ఏ పరిధిలోకి తీసుకుంది. ఇందులో అత్యధికంగా టీవీఆర్ స్కోర్ 242.9. దీనిని యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సాధించింది. ఆ తర్వాత స్థానంలో రష్యా ఉంది. రష్యా తర్వాత భారత్ కొనసాగుతోంది.టీవీఆర్ రేటింగ్స్ ప్రకారం చూసుకుంటే యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా 242.9 పాయింట్లు తో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో యునైటెడ్ స్టేట్స్ నేవీ విభాగం కొనసాగుతోంది. నేవీ విభాగానికి 142.4 టీవీఆర్ రేటింగ్ ఉంది. తర్వాత స్థానంలో 114.2రేటింగ్ తో రష్యన్ వైమానిక దళం కొనసాగుతోంది.. 112.6 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ ఆర్మీ కొనసాగుతోంది. 85.3 టీవీఆర్ రేటింగ్ తో యునైటెడ్ స్టేట్స్ మెరైన్స్ కొనసాగుతోంది. భారత వైమానిక దళం 64.9 టివిఆర్ రేటింగ్ తో ఆరవ స్థానంలో కొనసాగుతోంది.. వాస్తవానికి దేశాల ప్రకారం చూసుకుంటే అమెరికా మొదటి స్థానంలో.. రష్యా రెండవ స్థానంలో.. ఇండియా మూడో స్థానంలో ఉంది. 63.8 టివిఆర్ రేటింగ్ తో చైనా నాలుగో స్థానంలో.. ర్యాంకు పరంగా ఏడవ స్థానంలో ఉంది. పరేషన్ సిందూర్ తర్వాత భారత్ సొంత రక్షణపై మరింత దృష్టిపెట్టింది. స్వదేశీ ఆయుధాల తయారీకి ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో సరికొత్త ఆయుధాలను వేగంగా తయారు చేస్తోంది. ఇక ఇటీవలికాలంలో సముద్ర రక్షణపైనా మోదీ దృష్టి పెట్టారు. ఈమేరకు వివిధ దేశాలలో పర్యటిస్తూ.. సముద్ర రక్షణకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు భారత నౌకాదళాన్ని బలోపేతం చేస్తున్నారు. ఇందులో భాగంగా ఐఎన్ఎస్ మహేంద్రగిరిని రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ జాతికి అంకితం చేశారు. ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఈ స్వదేశీ స్టెల్త్ ఫ్రిగేట్ భారతదేశ రక్షణ ఉత్పత్తి సామర్థ్యానికి మరో ముఖ్యమైన ఉదాహరణగా నిలిచింది. ఇది కేవలం ఒక నౌక కమిషనింగ్ మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్ లక్ష్యం వైపు సాగుతున్న ప్రయాణంలో ఒక మైలురాయి.ఈ యుద్ధనౌక స్టెల్త్ టెక్నాలజీతో తయారైంది. దీని రూపకల్పనతో శత్రు రాడార్ల నుంచి సులభంగా గుర్తించడం కష్టం. బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్షిపణులు, అధునాతన గగనతల రక్షణ వ్యవస్థలు, జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామర్థ్యాలు దీనిలో భాగం. ఇవి బహుముఖ యుద్ధ పరిస్థితుల్లో నౌకను అత్యంత సమర్థవంతంగా మార్చుతాయి. ఆధునిక ఆయుధ వ్యవస్థలతో సన్నద్ధమైన ఈ ఫ్రిగేట్ భారత నౌకాదళం మొత్తం సామర్థ్యాన్ని పెంచుతుంది. ఐఎన్ఎస్ మహేంద్రగిరి ప్రాజెక్ట్ 17ఏ కింద నిర్మించిన ఆరవ స్టెల్త్ ఫ్రిగేట్. ఈ ప్రాజెక్టు ద్వారా భారతదేశం విదేశీ సాంకేతిక సహాయం లేకుండా అధునాతన యుద్ధనౌకలను నిర్మించే సామర్థ్యాన్ని సాధించింది. స్వదేశీ నిర్మాణం వల్ల ఖర్చు తగ్గడమే కాకుండా, సాంకేతిక జ్ఞానం స్వంతం అవుతుంది. ఇది రక్షణ రంగంలో ఆత్మనిర్భరతను పటిష్టం చేస్తుంది, భవిష్యత్తులో మరిన్ని నౌకల నిర్మాణానికి పునాది వేస్తుంది.రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హిందూ మహాసముద్రంలో శాంతి, స్థిరత్వానికి భారతదేశం ఒక ముఖ్యమైన భరోసాగా వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దేశ వాణిజ్యంలో 90 శాతం కంటే ఎక్కువ సముద్ర మార్గాల ద్వారా జరుగుతుంది. అందువల్ల సముద్ర భద్రతను కాపాడడం ఆర్థిక వృద్ధికి, జాతీయ భద్రతకు అవసరం. భవిష్యత్ యుద్ధాల్లో కొత్త సాంకేతికతలను స్వీకరించాలని సైనిక బలగాలకు రాజ్‌నాథ్‌సింగ్ సూచించారు. ఇది కేవలం ప్రస్తుత సవాళ్లను ఎదుర్కొనడానికి మాత్రమే కాకుండా, రేపటి మారుతున్న యుద్ధ వ్యూహాలకు సిద్ధం కావడానికి కూడా ముఖ్యం.ఐఎన్ఎస్ మహేంద్రగిరి ఆగమనం భారతదేశం సముద్ర రక్షణ వ్యూహాన్ని బలపరుస్తుంది. హిందూ మహాసముద్రంలో పెరుగుతున్న ఉద్రిక్తతల నేపథ్యంలో, అధునాతన స్టెల్త్ ఫ్రిగేట్లు భారత్‌ను 'నెట్ సెక్యూరిటీ ప్రొవైడర్'గా మార్చడానికి సహాయపడతాయి. స్వదేశీ నిర్మాణం ఆర్థికంగా లాభదాయకం మాత్రమే కాకుండా, విదేశీ ఆధారిత్వాన్ని తగ్గిస్తుంది. భవిష్యత్తులో సముద్ర యుద్ధాలు మరింత సాంకేతికంగా మారే అవకాశం ఉంది. సముద్ర భద్రతను కాపాడడం ద్వారా భారతదేశం తన ఆర్థిక ప్రయోజనాలను రక్షించుకోవడమే కాకుండా, ప్రాంతీయ శాంతిని కాపాడే బాధ్యతను కూడా నెరవేర్చగలుగుతుంది. కొంతకాలంగా డిఫెన్స్ రంగంలో భారీగా పెట్టుబడులు పెడుతోంది. రీసర్చ్ అండ్ డెవలప్మెంట్ వింగ్ ను పూర్తిగా ఆధునికరిస్తోంది. కొత్త కొత్త ఆయుధాలను.. యుద్ధ విమానాలను.. మిస్సైల్స్ ను తయారు చేస్తోంది. అందువల్లే ఇండియా మూడో స్థానంలో ఉంది. ఇదే రేంజ్ గనక కొనసాగిస్తే భారత్ రష్యా స్థానాన్ని ఆక్రమించే అవకాశం ఉందని డిఫెన్స్ రంగ నిపుణులు పేర్కొంటున్నారు.

# రామాలయ విరాళాల చోరీ



ఆనాడు సర్కార్ సొమ్ము భద్రాద్రి ఆలయానికి ఖర్చుపెట్టి జైలు పాలయ్యాడు భక్తరామదాసు. ఈనాడు అయోధ్య రామాలయం పేరు చెప్పి అధికారం దక్కించుకొన్న వారి అంతేవాసులే రాముడి సొమ్ము కైంకర్యం చేసి కటకటాలు లెక్కించడం విడ్డూరం. రథయాత్ర రాజకీయాలు ఆలయ నిర్మాణంతో క్లైమాక్స్‌కు చేరుకోవడం వరకు జరిగిన ఘటనల క్రమం బీజేపీ అంచెలంచెలుగా అధికార సోపానంపై ఎదగడానికి దోహదం చేశాయి. ఇప్పుడు అదే ఆలయంలో దేవుడి సొత్తును అదే బీజేపీ నియమించిన ట్రస్టీలు దిగమింగడం దారుణం. రామాలయం కోసం ఉద్యమం నడిపిన బీజేపీ ఆధ్వర్యంలోని పాలకులే గుడి కడుతున్నరంటే కోట్లాది మంది నమ్మారు. ధన, కనక, వస్తురూపేణా భూరిగా విరాళాలు సమర్పించుకొన్నారు. ఇప్పుడా నమ్మకం వమ్మయింది. ఏడెనిమిది కోట్ల రూపాయల విలువ చేసే నగదు, వెండి, బంగారు నగలు హుండీల నుంచి మాయమయ్యాయని అంటున్నారు. గుడిలో గుటకాయస్వాహా చేసిన సొమ్ము మొత్తం ఎంతో ఇదమిత్థంగా ఎవరికీ అంచనాలు లేవు. ఇది దోపిడీ దొంగల పని కాదు. ఆలయ నిర్వాహకులే ఓ పథకంప్రకారం సొత్తును బయటకు దాటించినట్టు తెలుస్తున్నది. దీనిపై మొదలైన దర్యాప్తు పర్యవసానంగా పెద్దసంఖ్యలో అరెస్టులు, భారీగా జప్తులు చోటుచేసుకోవడం, ట్రస్టీలు రాజీనామా చేయడం సంచలనం సృష్టించింది. దేశ రాజకీయాలకు కేంద్ర బిందువులా మారిన అయోధ్య ఆలయంలో కెమెరాల కన్నుగప్పి దుస్తుల్లో, కాలి మేజోళ్లలో దాచి హుండీసొత్తును తస్కరించడం నిఘావ్యవస్థ దారుణ వైఫల్యాన్ని పట్టిస్తున్నది. దర్యాప్తు జరుగుతున్న కొద్దీ రోజుకొకటిగా వెలుగు చూస్తున్న లోపాలు సంచలనం కలిగిస్తున్నాయి. హుండీ లెక్కింపు ఫుటేజీని 180 రోజులపాటు భద్రపర్చాల్సి ఉండగా 45 రోజుల పాటే అందుబాటులో ఉండటం వంటివి నిఘాను నిద్రపుచ్చడానికి అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. హుండీ సొమ్ము జమ చేసేందుకు ఎస్‌బీఐతో కుదుర్చుకొన్న ఒప్పందంలోని నిబంధనలు గాలికి వదిలేసి, తగిన భౌతిక తనిఖీలు జరుపకుండా, జేబులున్న దుస్తుల్లో వ్యక్తులను హుండీ లెక్కింపునకు అనుమతించడం విచిత్రం. ఇదంతా నిర్లక్ష్యమా లేక కావాలనే చేశారా? అని అనుమానం కలుగకమానదు. ఇప్పటివరకైతే ట్రస్టీలు, ఆలయ ఉద్యోగుల స్థాయిలోనే జవాబుదారీ బయటపడింది. అరెస్టయినవారు మౌలికంగా కింది స్థాయి ఉద్యోగులు. ట్రస్టీలు నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేశారు. అధికారంలో ఉన్నవారి మిలాఖతు మాటేమిటనే ప్రశ్న సహజంగానే ఈ సందర్భంగా తలెత్తుతున్నది. మొదటి నుంచీ ఆలయ రాజకీయాలతో నెట్టుకువస్తున్న బీజేపీకి ఇప్పుడు ఆలయ చోరీ పంకిలం అంటుకున్నది. బీజేపీ పర్యవేక్షణలో భక్తుల విరాళాలకు భద్రత కరువు కావడమే అందుకు కారణం. ఇంతటి వైఫల్యం బయటపడ్డ తర్వాత కూడా కొందరు మోదీ భజనపరులు.. ఈ చోరీ పెద్ద విషయం కాదన్నట్టుగా వితండవాదనలు చేయడం మూర్ఖత్వం. అయోధ్య ఆలయంలో చోరీ ఉదంతంతో డబుల్ ఇంజిన్ సర్కార్ బడాయిల పస తేలిపోయింది. సీబీఐ దర్యాప్తును కోరుతూ దాఖలైన పిటిషన్లపై కేంద్రానికి, యూపీ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ట్రస్టుకు నోటీసులు ఇవ్వొద్దని రెండు ప్రభుత్వాల తరఫున వినిపించిన వాదనలను కొట్టేసింది. సిట్ నివేదికకు సర్కార్ విధించిన గడువు రేపటితో ముగుస్తుంది. ఆ నివేదికలో కొత్త సంగతులతో పాటుగా కొత్త పేర్లు బయటకు వస్తాయనే ఊహగానాలు ఊపందుకున్నాయి. ఎవరి వాటా ఎంత అనే సంగతి తర్వాత తేలుతుందో లేదో తెలియదు కానీ, ఒకటి మాత్రం నిజం. డబుల్ ఇంజిన్ సర్కార్ వాదనలోని చిత్తశుద్ధి, విశ్వసనీయతపై మరకలు పడ్డాయని చెప్పకతప్పదు. ఇంత జరుగుతున్నా దేశానికి చౌకీదార్‌ను అని చెప్పుకొనే ప్రధాని నరేంద్రమోదీ కనీసం నోరు విప్పలేదు. ఈ ఉదంతంలో రాముడి పేరిట రాజకీయాలు చేసిన బీజేపీ ప్రతిష్ట, ముఖ్యంగా ఉత్తరాది రాష్ట్రాల్లో, చాలావరకు దిగజారింది. యూపీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ విపక్షాలకు ఈ ఆలయచోరీ శక్తిమంతమైన ఆయుధంగా మారుతున్నదనడంలో సందేహం లేదు.

# ఉద్యమకారులకు న్యాయం దక్కేనా?



అలవికాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ మాటలు నీటి మూటలేనని తేలిపోయింది. తెలంగాణ అమరవీరుల కుటుంబాలు, ఉద్యమకారులను కూడా మోసగించిం ది. అమరుల కుటుంబానికి ఒక ఉద్యోగం, నెలకు రూ.25 వేల గౌరవ పెన్షన్, ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గౌరవభృతి, సంక్షేమ చర్యలు చేపడుతామని మ్యానిఫెస్టోలో తెలిపింది. కానీ ముప్పై నెలలు పూర్తవుతున్నా అమలులో ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ఇది రాష్ట్రప్రజల విశ్వాసానికి గట్టి దెబ్బ.ల ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కమిటీలు, ఉపకమిటీలు, అఖిలపక్ష సమావేశాలు, అభిప్రాయ సేకరణలు అంటూ కాలం గడుపుతున్నది. ఉద్యమకారులకు అవసరమైనవి కమిటీలు కాదు, నిర్ణయాలు. ప్రభుత్వం ఒకవైపు అందరికీ ఇవ్వలేం అంటున్నది. మరోవైపు ఉద్యమకారుల ఎంపికకు స్పష్టమైన విధానం ప్రకటించడం లేదు. అయితే మొదట గుర్తింపు రావాల్సింది అమరవీరుల కుటుంబాలకు. ఆ తర్వాత జైళ్లలో నెలల తరబడి ఉన్నవారికి, పోలీసు కేసులు ఎదుర్కొన్నవారికి, ఉద్యోగాలు, విద్యా అవకాశాలు కోల్పోయిన విద్యార్థులకు, ఉద్యమంలో జీవితాన్ని అంకితం చేసిన కవులు, కళాకారులు, జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలి. ఇలా ఉద్యోగులు, డాక్టర్లు, లాయర్లు, ప్రభుత్వ, ప్రైవేటు ఉపాధ్యాయులు, ఒక్కరేమిటి అన్ని వర్గాలు తమ వృత్తిని వదిలి తెలంగాణ ఉద్యమంలో భాగమయ్యారు. ఇప్పటికే మూడు బడ్జెట్లు ప్రవేశపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యమకారుల సంక్షేమానికి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. బడ్జెట్‌లో నిధులు కేటాయించ కుండా హామీలు అమలు చేస్తామని చెప్పడంలో చిత్తశుద్ధి కనిపించడంలేదు. ఉద్యమకారుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలి. చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్ ఏర్పాటు చేయాలి. ఉద్యమకారుల సంక్షేమ కార్పొరేషన్ స్థాపించి, ప్రతి ఏడాదీ ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. అమరవీరుల కుటుంబాలకు గౌరవ పెన్షన్, విద్య, వైద్యం, ఉపాధి, గృహ భరోసా కల్పించాలి. విద్యార్థి ఉద్యమకారులకు ఉపాధి అవకాశాలు, వడ్డీ రహిత రుణాలు, పరిశ్రమల స్థాపనకు హామీ ఇవ్వాలి. కె.కేశవరావు కమిటీని కాలయాపన వేదికగా కాకుండా చట్టబద్ధ అధికారాలతో కూడిన కమిషన్‌గా మార్చాలి. తెలంగాణ ఉద్యమకారులను స్వాతంత్ర్య సమరయోధుల తరహాలో గౌరవించి, వారి సంక్షేమాన్ని ప్రభుత్వ శాశ్వత బాధ్యతగా స్వీకరించాలి. అమరవీరుల త్యాగాలను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి 611 మందికి ఉద్యోగాలు కల్పించి ఆర్థిక సహాయం చేసింది. ఉద్యమంలో ప్రజలను చైతన్యవంతం చేసిన కళాకారులకు 550 ఉద్యోగాలు కల్పించింది. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇచ్చింది. చాలామందికి రాజకీయ పదవులు ఇచ్చింది. కానీ ప్రజలను, ఉద్యమకారులను నమ్మించి గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు కచ్చితంగా అమలు చేసి తీరాల్సిందే. ఉద్యమ జేఏసీలో భాగస్వాములుగా ఉన్న మేం కేశవరావు కమిటీకి పలు సూచనలు చేశాం. 1969 ఉద్యమం నుంచి 2014 వరకు వివిధ రూపాలలో మరణించిన వారి జాబితా తయారు చేయాలి. ఉద్యమకారుల కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు రూ. 25,000 పెన్షన్, గృహ వసతి కల్పించాలి. ఉద్యమంలో జైలుకు వెళ్లిన విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. నిర్బంధాల వలన వైకల్యం లేదా ఇతర సమస్యలు తలెత్తి, ఇబ్బందులు పడుతున్న వారికి కూడా పెన్షన్ సౌకర్యం కల్పించాలి. సకలజనుల సమ్మెలో పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగులు, వారికి నాయకత్వం వహించిన సంఘాల బాధ్యులకు ప్రభుత్వ కార్యక్రమాలలో తగిన గౌరవం కల్పించాలి. ముఖ్యంగా ఆగస్టు 15, జనవరి 26, జూన్ 2 వేడుకల్లో ప్రత్యేక అతిథులుగా ఆహ్వానించాలి. ప్రభుత్వ ఉద్యోగాలకు వయోపరిమితి దాటిన వారికి, విద్యార్హతలు లేని వారికి ప్రభుత్వం రుణాలు ఇప్పించాలి. వివిధ వ్యాపారాలలో స్థిరపడే అవకాశం కల్పించాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలలో, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో ప్రత్యేక రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలి. భారత ప్రభుత్వం స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్న వారికి పెన్షన్, ఇతర సౌకర్యాలు కల్పిస్తున్నది. వాటిని పరిశీలించి తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని తెలంగాణ స్వాతంత్ర్య సమరయోధులుగా గుర్తించి న్యాయం జరిగేలా కృషి చేయాలి. జార్ఖండ్, ఉత్తరాఖండ్, ఛత్తీస్‌గఢ్‌లో ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పాల్గొన్న వారికి సమకూర్చిన సంక్షేమాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేయాలి. చట్టబద్ధమైన కమిషన్ ఏర్పాటు చేసి, ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఉద్యమకారుల సంక్షేమం నిరంతర ప్రక్రియగా ఉండాలి. అందుకోసం ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. తెలంగాణ వైతాళికుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి. ఉద్యమకారులకు వైద్య సదుపాయం కల్పించాలి. తెలంగాణ ఏర్పాటు, ఉద్యమంపై విషం చిమ్ముతున్న శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. రిటైర్డ్ ఉద్యోగులకు ప్రత్యేక ఇంక్రిమెంట్ ఇవ్వాలి, కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ అమలు చేసి ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన నియమించాలి. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తమ జీవితాలను అంకితం చేసిన ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఆలస్యం చేయకుండా అమలు చేయాలి. భారత స్వాతంత్ర్య సమరయోధులకు కల్పించిన తరహాలోనే తెలంగాణ ఉద్యమకారులకు కూడా అన్ని సంక్షేమ ప్రయోజనాలు అందేలా కృషి చేయాలి.

## బీజేపీకి చుక్కలు చూపిస్తున్న పీకే

**పాట్నా :** బీహార్ రాజకీయాల్లో ఇప్పుడు ఒకే పేరు మార్మోగుతోంది.. అదే ప్రశాంత్ కిషోర్ . మూడు దశాబ్దాలుగా భారతీయ జనతా పార్టీకి అజేయమైన కోటగా ఉన్న బంకీపూర్ అసెంబ్లీ నియోజకవర్గంలో పీకే ఎంట్రీ ఇవ్వడమే ఆలస్యం, అక్కడ పొలిటికల్ మైండ్ గేమ్‌తో కమల దళానికి ఆయన చుక్కలు చూపిస్తున్నారు. నామినేషన్ వేసిన కేవలం 24 గంటల వ్యవధిలోనే బీజేపీ అభ్యర్థి అభిషేక్ సిన్హా అర్ధాంతరంగా బరి నుంచి తప్పుకున్నారు. ఒకప్పుడు తెరవెనుక ఉండి దేశవ్యాప్తంగా ఎందరో నాయకులను గెలిపించిన ఈ కింగ్‌మేకర్, ఇప్పుడు తానే నేరుగా ప్రజాక్షేత్రంలోకి దిగి ప్రత్యర్థుల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నారు.బంకీపూర్ ఉపఎన్నిక బరిలో ప్రశాంత్ కిషోర్ స్వయంగా నిలబడటంతో బీజేపీ తీవ్ర ఆత్మరక్షణలో పడింది. పీకే లాంటి చాణక్యుడి ముందు అభిషేక్ సిన్హా చాలా బలహీనమైన అభ్యర్థి అని ఆ పార్టీ అంతర్గత సర్వేల్లో తేలడమే కాకుండా, ఆయనకు సంబంధించిన కొన్ని వివాదాస్పద ఆర్థిక లావాదేవీల చిట్టా పీకే చేతికి చిక్కిందనే ప్రచారం పట్నా రాజకీయాలను కుదిపేస్తోంది. ఆ ఆధారాలు ఎన్నికల ప్రచారంలో బయటపడితే పార్టీ పరువు గంగలో కలుస్తుందని భావించిన అధిష్టానమే, బంటితో బలవంతంగా నామినేషన్ ఉపసంహరింపజేసింద భావిస్తున్నారు. ఈ పరిణామంతో, ప్రత్యర్థులను ఈడీ, సీబీఐలతో భయపెట్టే బీజేపీ.. ఇప్పుడు ఓటమి భయంతో తానే రంగు మార్చి పారిపోతోందంటూ పీకే వేసిన సెటైర్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.నష్టనివారణ చర్యల్లో ఓ బీజేపీ యువజన విభాగంలో పనిచేసే నీరజ్ కుమార్ సిన్హాను కొత్త అభ్యర్థిగా అత్యవసరంగా బరిలోకి దించింది. ఐదుసార్లు వరుసగా గెలిచిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ రాజ్యసభకు వెళ్లడంతో ఖాళీ అయిన ఈ స్థానం, కమలదళానికి అత్యంత ప్రతిష్టాత్మకం. గత 2025 ఎన్నికల్లో ఇక్కడి నుంచి ఆర్జేడీ అభ్యర్థి రేఖా కుమారిపై నితిన్ నవీన్ 51 వేల ఓట్ల భారీ మెజారిటీతో గెలిచారు. అయితే, ఇప్పుడు పీకే స్వయంగా రంగంలో ఉండటం, ఆర్జేడీ తరఫున మళ్లీ రేఖా కుమారి పోటీలో నిలవడంతో ఈ ఉపఎన్నిక రసవత్తరమైన త్రిముఖ పోరుగా మారింది.జులై 30న జరగబోయే పోలింగ్, ఆగస్టు 3న వచ్చే ఫలితాలను ప్రశాంత్ కిషోర్ తన రాజకీయ భవిష్యత్తుకు ఒక రెఫరెండం గా ప్రకటించారు. మొదటి విడతలోనే అభ్యర్థిని మార్చాల్సి వచ్చేలా చేసి బీజేపీ డిఫెన్స్‌లో పడిందనే నెరేటివ్‌ను సెట్ చేయడంలో పీకే ఇప్పటికే సగం విజయం సాధించారు.

# విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రల పంపిణీ చేసిన సర్పంచ్ శేఖర్ యాదవ్



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

పిల్లల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా తలకొండపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1 నుంచి 19 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులకు జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం అల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శేఖర్ యాదవ్, ఉపసర్పంచ్ కోటీశ్వర్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ లలిత జ్యోతయ్య , వైద్యాధికారి డాక్టర్ స్నేహ మేడం, ప్రధానోపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ లక్ష్మీ మేడం, ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొని విద్యార్థులకు స్వయంగా మాత్రలు వేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకు ఒకసారి అల్బెండజోల్ మాత్రలు తీసుకోవడం ద్వారా కడుపులోని నులిపురుగులు నివారించ బడతాయని, పిల్లల ఆరోగ్యం మెరుగుపడి శారీరక, మానసిక ఎదుగుదలకు దోహద పడుతుందని తెలిపారు. నులిపురుగుల వల్ల రక్తహీనత, పోషకాహార లోపం ఏర్పడి పిల్లలు బలహీనపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత కూడా తగ్గుతుందని వివరించారు. తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు డీవార్మింగ్ మాత్రలు వేయించాలని కోరారు. అలాగే కేవలం మాత్రలతోనే కాకుండా, భోజనం చేసే ముందు మరియు మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, పరిశుభ్రమైన పరిసరాలు, స్వచ్ఛమైన తాగునీటిని వినియోగించడం వంటి మంచి అలవాట్లను పిల్లల్లో పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని అల్బెండజోల్ మాత్రలను తీసుకున్నారు. పిల్లల ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులు తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు.

# తోటపల్లి--ఎల్లికట్ట రోడ్డు నిర్మాణం వెంటనే చేపట్టాలి

**లేకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తాం బీజేపీ నేత తల్లోజు ఆచారి**



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి, తోటపల్లి--ఎల్లికట్ట రహదారి అధ్వాన్నంగా మారి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని బీజేపీ నేత, జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు మట్ట నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులతో కలిసి తోటపల్లి--ఎల్లికట్ట రహదారిని పరిశీలించిన అనంతరం తల్లోజు ఆచారి మాట్లాడుతూ, రహదారి పూర్తిగా దెబ్బతినడంతో రైతులు, విద్యార్థులు, వాహనదారులు నిత్యం అవస్థలు పడుతున్నారని అన్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమని విమర్శించారు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని తక్షణమే రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రజలతో కలిసి కల్వకుర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు మొగిలి దుర్గాప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బోడ నర్సింహ, నాయకులు గుర్రాల రాంభూపాల్ రెడ్డి, కృష్ణ గౌడ్, సురేందర్ గౌడ్, శ్రీశైలం, బాలకృష్ణ, రాజశేఖర్, రమణ గౌడ్, లక్ష్మారెడ్డి, శంకర్ గౌడ్ తదితరులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్మికులకు పనిముట్లు లేవు.. నజరానాలకు నిధులా?

**సింగరేణి యాజమాన్యంపై ఏఐటీయూసీ నేత రంగు శ్రీను విమర్శలు**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**



సింగరేణి కార్మికులకు అవసరమైన కనీస పనిముట్లు, రక్షణ పరికరాలు అందించడంలో యాజమాన్యం పూర్తిగా విఫలమైందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను ఆరోపించారు. కార్మికుల అవసరాలను విస్మరించి, సంస్థ నిధులను ఇతర కార్యక్రమాలకు ఖర్చు చేయడం సరికాదని ఆయన డిమాండ్ చేశారు.

సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, గత రెండు నెలలుగా డ్రిల్ బిట్స్, డ్రిల్ రాడ్స్, కీలలు, పట్టీలు, గిర్మిట్లు, స్మాల్ మ్యాన్ క్లిప్స్, రెజిన్ క్యాప్సూల్స్, రక్షణ పరికరాలు, బూట్లు, టోపీలు, గ్లౌజులు, ఎస్‌డీఎల్‌లకు అవసరమైన విడిభాగాలు, టెక్నీషియన్లకు అవసరమైన ఆధునిక పనిముట్లు వంటి కనీస సామగ్రి కూడా సరఫరా కావడం లేదన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఒకవైపు కార్మికులకు అవసరమైన పనిముట్లు కొనుగోలు చేయలేని పరిస్థితి నెలకొనగా, మరోవైపు ఎవరో తెలియని వ్యక్తులకు ఐఏఎస్‌ల పేరుతో లక్షల రూపాయల నజరానాలు ప్రకటించడం ఏమిటని యాజమాన్యాన్ని ప్రశ్నించారు. అలాగే సంస్థ నిధులను ప్రభుత్వ కార్యక్రమాలకు వినియోగించడం, సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ, రాయల్టీలు, సెస్సుల నిధులను ఇతర అవసరాలకు మళ్లించడం సరికాదని విమర్శించారు. సింగరేణి ఇప్పటికే ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్న నేపథ్యంలో ఇలాంటి ఖర్చులు సంస్థ భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయని అన్నారు. వెంటనే కార్మికులకు అవసరమైన పనిముట్లు, రక్షణ పరికరాలను అందించడంతో పాటు నజరానాల పేరుతో జరుగుతున్న ఖర్చులను నిలిపివేయాలని, సింగరేణి వ్యవహారాల్లో రాజకీయ జోక్యాన్ని నివారించాలని డిమాండ్ చేశారు. కార్మికుల శ్రమతోనే సింగరేణి ముందుకు సాగుతోందని, వారి సంక్షేమాన్ని విస్మరించడం తగదని పేర్కొన్న రంగు శ్రీను, కార్మికులు చైతన్యంతో ఆలోచించి తమ హక్కుల పరిరక్షణ కోసం ఏఐటీయూసీ చేపట్టే ఉద్యమాలకు సహకరించాలని పిలుపునిచ్చారు.

## జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం

**ఎం ఏవో సైదులు డాక్టర్ సత్యప్రకాష్**



జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా కస్తూరిబా హైస్కూలు లో డాక్టరు సత్యప్రకాష్ ఎంఈఓ సైదులు అధ్వర్యంలో స్కూలు విద్యార్థులందరికి అల్బెన్ డజోల్ మాత్రల పంపిణి చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరు టాబ్ -అల్బెండెజాల్ వేసుకోవాలని దీని వల్ల కడుపులో నులిపురుగులు చనిపోతాయని ఆకలి మంచిగా అవుతుందని చిన్నపిల్లలు ముఖ్యంగా స్కూల్ కి వచ్చేటప్పుడు ఆహారం తీసుకోకుండా వస్తుంటారు వారికి కడుపులో నులిపురుగులు ఉండడం వల్ల సరైన ఆకలి కాక మనం తిన్న ఆహారము సరిపోక రక్తహీనత ,వారికి చదువుపై శ్రద్ధ తగ్గి అనారోగ్య పాలవుతారు అన్నారు. ఆరు బయట పిల్లలు ఆడుకొని చేతులు శుభ్రంగా కడుక్కోకుండా శుభ్రత పాటించకుండా ఉండడం వల్ల కడుపులో నులిపురుగులు చేరి పిల్లలను అనారోగ్య పాలు చేస్తా యి. దీనివల్ల వాంతులు విరోచనాలు దద్దులు కడుపులో మంట ఏకాగ్రత లోపించడం బుద్ధిమాంద్యము మొదలైన సమస్యలు ఏర్పడతాయి .ఈ కార్యక్రమంలో పిహెచ్ సి వైద్య సిబ్బంది , ఆశా కార్యకర్తలు , స్కూలు ఉపాద్యాయులు పాల్గోన్నారు .

## ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కడ్తాల్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పర్యటించిన కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చరికొండ, ఎక్వాయిపల్లి గ్రామపంచాయతీలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీల్లో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఎమ్మెల్యే కసి రెడ్డి నారాయణ రెడ్డి స్వయంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పారదర్శకంగా, నిబంధనల మేరకు పూర్తి చేసి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి సూచించారు.

# ఆశ్రమంలో మోక్షిత్ జన్మదిన వేడుకలు

**అన్నదానంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకుల పంపిణీ**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

ఆడంబరాలకు దూరంగా ఆశ్రమంలోని చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించడం సమాజానికి ఆదర్శమని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి అన్నారు. ఎన్టీపీసీలో ఏజీఎంగా సేవలందించి ప్రస్తుతం మహారాష్ట్రలోని మౌదకు బదిలీపై వెళ్లిన తడక శ్రీనివాస్ తన కుమారుడు మోక్షిత్ 13వ జన్మదిన వేడుకలను రామగుండంలోని తబిత ఆశ్రమంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమంలోని చిన్నారులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడంతో పాటు ఆశ్రమ నిర్వహణ కోసం ఒక క్వింటాల్ బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కందుల సంధ్యారాణి మాట్లాడుతూ, ప్రార్థించే పెదవుల కంటే సహాయం చేసే చేతులే గొప్పవని ఆచరణలో నిరూపిస్తూ తబిత ఆశ్రమాన్ని నిర్వహిస్తున్న వీరేందర్ సేవలు అభినందనీయమన్నారు. ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొంటూ 70 నుంచి 80 మంది అనాథ, నిరుపేద చిన్నారులకు ఆశ్రయం కల్పించడంతో పాటు విద్యను అందిస్తూ సేవాభావంతో ముందుకు సాగడం సమాజానికి ఆదర్శమని కొనియాడారు. కుటుంబ శుభకార్యాలను ఆడంబరంగా నిర్వహించకుండా ఆశ్రమాల్లోని చిన్నారులతో ఆనందాన్ని పంచుకోవడం గొప్ప ఆలోచన అని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో సేవాభావాన్ని పెంపొందించడంతో పాటు సానుకూల సందేశాన్ని అందిస్తాయని అన్నారు. తడక శ్రీనివాస్ మాట్లాడుతూ, తమ కుమారుడి జన్మదిన వేడుకలను ఆశ్రమంలో నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలకు తమ కుటుంబం నుంచి భవిష్యత్తులో కూడా సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తబిత ఆశ్రమ నిర్వాహకులు వీరేందర్, తడక శ్రీనివాస్ కుటుంబ సభ్యులు సృజన, నక్షత్ర, తోట రవి, మాడ ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్, సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలించిన తల్లోజు ఆచారి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి మండలంలోని మార్చాల,కుర్మిద్ద, జిడిపల్లి, తోటపల్లి, వేపూరు, గుండూరు, సుద్దకల్, గ్రామాలలో జరుగుతున్న ప్రత్యేక ఓటర్ నమోదు ప్రక్రియను బీజేపీ బి సి జాతీయ మాజీ కమిషన్ సభ్యులు ఆచారి స్థానిక బీజేపీ నాయకులతో మరియు బి ఎల్ ఎ ఎజెంట్లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ,ఓటర్ నమోదు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఓటర్ జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో, కుర్మిద్ధ సర్పంచ్ గుర్రాల కృష్ణ రెడ్డి,వార్డ్ సభ్యులు బాల్ రాజ్ స్థానిక బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటా



**అర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన బయ్య జగదీశ్ గుండె పోటుతో మరణించడం జరిగింది విషయం తెలుసుకున్న సర్పంచి మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ వారి కుటుంబనికి సానుభూతి తెలుపుతూ పరామర్శించి కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గుండాల సర్పంచి మమత వెంకటేష్ యాదవ్, వార్డు సభ్యులు పాలది మల్లీశ్వరి రంగనాథం,గుద్దటి కిష్టల్, మసిగుండ్ల వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, చిమ్ముల తిరుపతి రెడ్డి, మట్ట భరత్ గౌడ్,కొయ్యల పుల్లయ్య,మట్ట నాగయ్య, దర్గయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత



**బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రానికి చెందిన బయ్య జగదీష్ ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో అకస్మాత్తుగా మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు కానుగుల జోగయ్య మృతుని కుటుంబానికి సానుభూతి తెలుపుతూ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు 5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో, మాజీ ఎంపీటీసీ నిరంజన్, లింగం,వార్డు సభ్యులు సిర్సనగండ్ల శేఖర్,కొమ్ము నాగయ్య,బిట్టి సైదులు,పిల్లి శ్రీను,జంగిలి సంజీవ, దేవదాసు,తుంగ శ్రీను,సింగరాజు రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి నీ దర్శించుకున్న వెల్జాల్ కాంగ్రెస్ నాయకులు



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

హైదారాబాద్ లోని జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లి నీ వెల్జల్ శ్రీ లక్ష్మి నరసింహ స్వామీ ఆలయ ధర్మ కర్త మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గుప్త ఆధ్వర్యంలో అమ్మ వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించిన కాంగ్రెస్ నాయకులు ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ,అమ్మ వారిని దర్శించుకోవడం చాలా అదృష్టం అని అమ్మ వారి ఆశీర్వాదంతో ప్రజలు చల్లంగా ఉండాలని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో,మార్కెట్ కమిటీ డైరక్టర్ చర్ల వెంకట్ రెడ్డి,తది తరులు పాల్గొన్నారు.

## రహదారిపైన ఇసుక లారీల పార్కింగ్‌పై కలెక్టర్ కు ఫిర్యాదు.

**జయశంకర్ భూపాలపల్లి.** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలం మద్దులపల్లి గ్రామ సర్పంచ్ ఎల్పుల సరిత జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. కాళేశ్వరం?మద్దులపల్లి ప్రధాన రహదారిపై ఇసుక కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వందలాది ఇసుక లారీలను పార్కింగ్ చేయడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు

# నిరుద్యోగుల సమస్యలపై జూలై 15న మహాధర్నా

**భారీగా తరలిరావాలని సీపీఎం పిలుపు**

**అగ్నిధార న్యూస్ (తాండూరు):**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 15న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం తాండూరు మండల కార్యదర్శి దాగం రాజారాం పిలుపునిచ్చారు. సోమవారం తాండూరు మండల కేంద్రంలోని భగత్‌సింగ్ భవన్‌లో మహాధర్నా కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో యువశక్తి అధికంగా ఉన్నప్పటికీ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు. నిరుద్యోగ సమస్య రోజురోజుకూ తీవ్రమవుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగాల కల్పనపై ఇచ్చిన హామీలు అమలు కాలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ శాఖల్లో లక్షలాది ఖాళీలు ఉన్నప్పటికీ నియామకాలు చేపట్టడం లేదని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను బలహీనపరుస్తూ ప్రైవేటీకరణకు ప్రాధాన్యం ఇవ్వడం వల్ల ఉద్యోగ అవకాశాలు మరింత తగ్గుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు నిరుద్యోగ యువత ఆకాంక్షలు ప్రధాన కారణమని గుర్తు చేసిన ఆయన, రాష్ట్ర ప్రభుత్వం కూడా ఉద్యోగాల భర్తీ విషయంలో ఇచ్చిన




హామీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. జాబ్ క్యాలెండర్ అమలు, వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీల భర్తీ, పోలీస్ శాఖలో నియామకాలు, డీఎస్సీ, గ్రూపులు, జూనియర్ లెక్చరర్, డిగ్రీ లెక్చరర్ తదితర పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ.5 వేల భృతి చెల్లించడం, బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయడం, వివాదాస్పద జీవోలను రద్దు చేసి పారదర్శకంగా నియామకాలు చేపట్టడం, రాజీవ్ యువ వికాస్ పథకాన్ని అమలు చేయడం వంటి డిమాండ్లతో జూలై 15న జరిగే మహాధర్నాలో నిరుద్యోగ యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాల విడుదల కార్యక్రమంలో కేవీపీఎస్ తాండూరు మండల కార్యదర్శి దుర్గం నాన్నయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు వేల్పుల శంకర్, డీవైఎఫ్ఐ మండల అధ్యక్షుడు బొల్లం రాజేశం, మొగిలి, రాములు తదితరులు పాల్గొన్నారు.

# అద్దె వాహనాల డ్రైవర్ల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**శ్రమ దోపిడీ చేస్తున్న యజమానులకు సింగరేణి యాజమాన్యం వత్తాసు**

**: ఏఐటీయూసీ నేత ఎం.ఎ. గౌస్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

సింగరేణి ఆర్జీ-1 ఏరియాలో అద్దె వాహనాలపై పనిచేస్తున్న డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘం (ఏఐటీయూసీ) ఆర్జీ-1 అధ్యక్షుడు ఎం.ఎ. గౌస్ డిమాండ్ చేశారు. డ్రైవర్ల శ్రమను దోపిడీ చేస్తున్న వాహన యజమానులకు సింగరేణి యాజమాన్యం వత్తాసు పలుకుతూ కార్మికులకు అన్యాయం చేస్తోందని ఆరోపించారు. సోమవారం గోదావరిఖనిలోని భాస్కర్‌రావు భవన్‌లో నిర్వహించిన అద్దె వాహనాల డ్రైవర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, డ్రైవర్లకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయకుండా, వారి వేతనాల నుంచి భవిష్యనిధి (పీఎఫ్) పేరుతో నిబంధనలకు విరుద్ధంగా కోతలు విధిస్తున్నారని ఆరోపించారు. టెండర్ నిబంధనల ప్రకారం 12 గంటల విధులకు నెలకు రూ.34 వేల వేతనం, 8 గంటల




విధులకు రూ.23 వేల వేతనం చెల్లించాల్సి ఉండగా, యజమానులు వరుసగా రూ.18 వేలు, రూ.15 వేలు మాత్రమే చెల్లిస్తున్నారని తెలిపారు. అంతేకాకుండా, 12 గంటల విధులు నిర్వహించే వారి నుంచి రూ.4 వేలు, 8 గంటల విధులు నిర్వహించే వారి నుంచి రూ.3 వేలు భవిష్యనిధి పేరుతో అక్రమంగా వసూలు చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులకు చట్టబద్ధంగా రావాల్సిన బోనస్, సెలవులు, యూనిఫాం, హెల్మెట్, భద్రతా బూట్లు, ఉద్యోగుల రాష్ట్ర బీమా (ఈఎస్ఐ) సౌకర్యం, ప్రమాద బీమా వంటి హక్కులను కూడా కల్పించడం లేదన్నారు. డ్రైవర్ల పేరుతో సింగరేణి యాజమాన్యం నుంచి చెల్లింపులు పొందుతున్న వాహన యజమానులు, ఆ మొత్తాలను డ్రైవర్లకు అందించకుండా అక్రమాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. ఈ అంశాలపై ఇప్పటికే లిఖితపూర్వకంగా యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గౌస్ అన్నారు. టెండర్ నిబంధనల ప్రకారం పూర్తి వేతనాలు అమలు చేయాలని, భవిష్యనిధి పేరుతో జరుగుతున్న అక్రమ కోతలను నిలిపివేయాలని, బోనస్, సెలవులు, యూనిఫాం, హెల్మెట్, ఉద్యోగుల రాష్ట్ర బీమా, ప్రమాద బీమా వంటి సంక్షేమ సౌకర్యాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డ్రైవర్లతో కలిసి ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# రక్తదానంతో నిరసన..

**రైతులకు నీళ్లు ఇవ్వాలని బీఆర్ఎస్ డిమాండ్**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

రైతులకు సాగునీరు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ నాయకులు రామగుండంలో సోమవారం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. పట్టణంలోని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, అల్ట్రాటెక్ సిమెంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి నివాసంలో నిర్వహించిన ఈ శిబిరంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కౌశిక హరి మాట్లాడుతూ, రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో వారి సమస్యలను పరిష్కరించాల్సిన రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ విమర్శలకే పరిమితమైందని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ నాయకుల రక్తాన్ని పొలాల్లో చల్లితే పంటలు పండుతాయంటూ చేసిన వ్యాఖ్యలు రైతులను, బీఆర్ఎస్ నాయకత్వాన్ని అవమానించేలా ఉన్నాయని అన్నారు. ఆ వ్యాఖ్యలకు నిరసనగానే ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించామని తెలిపారు. "మా రక్తాన్ని తీసుకుని అయినా రైతుల పొలాలకు నీరు అందించండి. రైతుల గోసను



దృష్టిలో ఉంచుకుని మేమంతా స్వచ్ఛందంగా రక్తదానం చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని మార్చుకుని రైతులకు తక్షణమే సాగునీరు అందించాలి. లేదంటే రైతుల హక్కుల కోసం ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నాం" అని కౌశిక హరి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పర్లపల్లి రవి, జేబీ రాజు, 28వ డివిజన్ కార్పొరేటర్ ధారంగుల కుమార్, 29వ డివిజన్ కార్పొరేటర్ నిమ్మరాజుల రజని రవి, మద్దికుంట శంకర్, కుక్క గంగాప్రసాద్, మాడిశెట్టి రవీందర్, బోనగిరి కుమార్, రవి నాని, జరుపుల శ్రీనివాస్, శెట్టి రాజశేఖర్, గౌస్ బాబ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే పాలకుర్తి మండలానికి చెందిన అల్ట్రాటెక్ సిమెంట్ కాంట్రాక్టు కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మాదాసు శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ బత్తిని సతీష్ గౌడ్, ఫ్లైయాష్ లారీ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దపల్లి నాగరాజు, అంతర్గాం మండల నాయకులు శరణ్య మధుకర్ రెడ్డి, బండారి ప్రవీణ్, కొల్లూరి సతీష్, గోదావరిఖని నాయకులు పున్నమి శశికుమార్, గడపురం కళ్యాణ్, మేకల శ్రీనివాస్ యాదవ్, ఆలకుంట రాజేందర్, కలవల సాగర్‌తో పాటు వివిధ మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వరి, ప్రత్తి, మొక్కజొన్న పంటలను సందర్శించిన డాక్టర్ పల్లవి జిల్లా అధికారి స్వరూప రాణి

**అగ్నిధార న్యూస్**

తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం, సిద్దిపేట శాస్త్రవేత్త డా. పల్లవి వ్యవసాయ శాఖ నుంచి జిల్లా వ్యవసాయ అధికారిని స్వరూపరాణి, మండల వ్యవసాయ అధికారి వసంత రావు ఆలీరాజపేట్ గ్రామం, జగదేవపూర్ మండలంలో వరి, ప్రత్తి, మొక్కజొన్న పోల్లాల్ని సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా వరి నారులో మొగిపురుగు ఉధృతంగా గమనించడం జరిగింది. ప్రస్తుతం ఉన్నటువంటి రెక్కల పురుగు గుడ్ల సముదాయాన్ని నివారించడానికి వేప నూనే లేదా వేప కాషాయం 5మి.లీ/లీటర్ క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ఒక ఎకరా నారు మడికి ఒక లింగాకర్ష బుట్ట పెట్టి కూడా పురుగు ఉధృతిని తగ్గించవచ్చును. తర్వాత 800 గ్రా. కార్బోఫ్యురాన్ 3జి గుళికలను నాటువేసే వారం రోజుల ముందు వేసుకున్నట్లితే మొగిపురుగును నివారించవచ్చును. అదేవిధంగా కొన్ని చోట్ల ఉష్ణోగ్రతల హెచ్చు తగ్గుల వలన సరియైన పోషకాలు అందక నార్లు కోనలు ఎర్రబాడటం జరిగింది. దీని నివారణకు ఫార్ములా-4 లేదా ఫార్ములా-6 లేదా 19.19.19 లేదా 13.0.45 ,10గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. మొక్కజోన్న పంటలో ప్రస్తుతం ఉన్న బెట్ట పరిస్థితులలో కత్తెర పురుగు, కాండం తొలుచు పురుగు గమనించడం జరిగింది. వీటి నివారణకు వేప నూనే లేదా వేప కాషాయం 5 మి.లీ/లీటర్ క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ/లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. అలాగే సుడులలో కార్బోఫ్యురాన్ 3జి గుళికలను వేసుకోవాలి. ప్రత్తిలో రసం పీల్చు పురుగులు ఐన పచ్చదోమ, పెనుబంక, పిండి నల్లి ఉధృతి గమనించడం జరిగింది. వీటి నివారణకు వేప నూనే లేదా వేప కాషాయం 5 మి.లీ/లీటర్ ఎసిపేట్ 1.5 గ్రా. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటర్ నీటికి కలిపి పిచికారి చేసుకోవాలి. ప్రస్తుత చేన్లు 2-4 ఆకుల దశలో ఉన్నందున లోటు వర్షపాతం వలన బెట్టకు గురవుతున్నాయి. అదేవిధంగా ప్రత్తి పంట పెరుగుదలకై 19.19.19 లేదా సోమవారం 10గ్రా. ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేసుకోవాలని అంతే కాకుండా భూమిలో ఉన్న తేమను సంరక్షించుకోడానికి కలుపు నివారణకు గుంటుకలు తోలాలని, సరియైన తేమ ఉన్నపుడే మొదటి దఫా ఎరువులను



వేసుకోవాలని డా. పల్లవి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ మెంబెర్ బ్రహ్మాచారి, క్రిషిసఖి లలిత, అలిరాజపేట్ గ్రామా రైతులు బాపురెడ్డి, కిష్టయ్య, వ్యవసాయ కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు, 10 మంది రైతులు తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ బాధిత కుటుంబానికి సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అండ



**బియ్యం, నిత్యావసర సరుకులు అందజేత**

**అగ్నిధార న్యూస్,( రామగుండం):**

క్యాన్సర్‌తో ఇటీవల మృతి చెందిన కదాసి మహేష్ కుటుంబానికి సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అండగా నిలిచింది. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 7వ డివిజన్ గంగానగర్‌కు చెందిన మహేష్ కొద్ది రోజుల క్రితం క్యాన్సర్‌తో పోరాడుతూ కన్నుమూశారు. ఆయనకు భార్య జ్యోతి, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. స్థానికుల ద్వారా కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్ స్పందించి సోమవారం బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యంతో పాటు నెల రోజుల పాటు సరిపడే నిత్యావసర సరుకులను అందజేశారు. ఫౌండేషన్ సభ్యుడు న్యాతరి ఆదిత్య ద్వారా ఈ సహాయం అందించినట్లు తెలిపారు.

ఈ సందర్భంగా బాధితురాలు కదాసి జ్యోతి మాట్లాడుతూ, భర్తకు మెరుగైన వైద్యం అందించేందుకు అప్పులు చేసి ఆస్పత్రుల చుట్టూ తిరిగినా ప్రాణాలు కాపాడుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలతో జీవనం సాగించడం కష్టంగా మారిందని, ఇంట్లో తినడానికి కూడా బియ్యం లేని పరిస్థితిలో తమకు అండగా నిలిచిన సేవా స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షుడు మడిపెల్లి మల్లేష్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. తమలాంటి ఆపదలో ఉన్న కుటుంబానికి మరిన్ని దాతలు ముందుకు వచ్చి సహాయం చేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గుడిసెల నంభయ్య, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

## జూలై 17 న జాబ్ మేళా

**జిల్లాఉపాధి కల్పనాధికారి ఎం.రాజశేఖర్**

**అగ్నిధారన్యూస్ ?పెద్దపల్లి, జూలై - 13:**



జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ బ్రాడ్‌బ్యాండ్ కంపెనీలో ఉద్యోగాలు కల్పించుటకు జూలై 17న శుక్రవారం జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఎం. రాజశేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిర్‌టెల్ ఎక్స్‌ట్రీమ్ బ్రాడ్‌బ్యాండ్ సంస్థలో మొత్తం 54 ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఇందులో ఇంజనీర్లు 23 ఖాళీలు, వైర్‌మెన్లు 23 ఖాళీలు, సేల్స్ ఎగ్జిక్యూటివ్ 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల ప్రాంతాల్లో ఉంటాయని, ఇంజనీర్ ఉద్యోగాలకు డిగ్రీ ,డిప్లమా, డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన అభ్యర్థులు అర్హులని, వైర్ మెన్ ఉద్యోగాలకు 10వ తరగతి, డ్రైవింగ్ లైసెన్స్, కలిగిన అభ్యర్థులు అర్హులని సేల్స్ ఎగ్జిక్యూటివ్ ఉద్యోగాల కొరకు డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు 18 సంవత్సరాల నుండి 34 సంవత్సరాల వయసు గల యువతి, యువకులు అభ్యర్థులు అని ఆసక్తి గల అభ్యర్థులు జూలై 17న ఉదయం 11 గంటలకు అప్‌డేట్ చేసిన సివి/రెజ్యూమ్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు జిరాక్స్, అనుభవ ధృవీకరణ పత్రం (ఉంటే) తీసుకుని సమీకృత జిల్లా కలెక్టర్ కార్యాలయం మొదటి అంతస్తులోని రూమ్ నెం. 233కు వచ్చి తమ పేర్లను నమోదు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9908674056, 8985336947, 8121262441 నంబర్లలో సంప్రదించాలని జిల్లా ఉపాధి అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## పంటల పై ఎల్ నినో ప్రభావం

**జిల్లా సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర.**

**అగ్నిధార న్యూస్ పెద్దపల్లి, జూలై 13:**



ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎల్నినో ప్రభావం వల్ల సాధారణం కంటే వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ సూచించింది. పెద్దపల్లి జిల్లాలో సాధారణ వర్షపాతం (237.4 మి.మీ) తో పోలిస్తే, ప్రస్తుతం 13 శాతం లోటుతో (206.6 మి.మీ) వర్షపాతం నమోదైనట్లు పంటల సాగులో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలని కూనారం వ్యవసాయ పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బి. సతీష్ చంద్ర సోమవారం ఒక ప్రకటనలో రైతులకు సూచించారు. జిల్లాలో ఇప్పటికే 2 లక్షల ఎకరాల్లో నాట్లు పూర్తయ్యాయి. ఇంకా నాట్లు వేయని రైతులు స్వల్పకాలిక (120 రోజులు) రకాలను ఎంచుకుని, జూలై 15 లోపు నాట్లు పూర్తి చేసుకోవాలని, జూలై 15 తర్వాత నాట్లు వేసే రైతులు తెలంగాణ సోనా( ఆర్ఎన్ఆర్ ) 15048 రకాన్ని నాటుకోవాలని తెలిపారు. పత్తి రైతులు జూలై 20 లోపు విత్తన ప్రక్రియను పూర్తి చేయాలి. మట్టిలో తేమను బట్టి విత్తనం వేయాలి. పత్తిలో బోర్డర్, ఇతర పంటలను అంతర పంటలుగా సాగు చేయడం ద్వారా అదనపు ప్రయోజనం ఉంటుందని అన్నారు. మొక్కజొన్న 90-100 రోజుల స్వల్పకాలిక లేదా 100-110 రోజుల మధ్యకాలిక రకాలు అనుకూలం జూలై 16 నుండి 31 మధ్య నాట్లు పూర్తి చేయాలని ,?ఇతర పంటలు తక్కువ వర్షపాతానికి అనువైన కంది, పెసర, మినుము, అలసందలు (జొన్నలు, సజ్జలు) వంటి పంటలను ఎంచుకోవాలని, స్వల్పకాలిక పంటలను సాగు చేయడం ద్వారా నీటి ఎద్దడిని తట్టుకోవచ్చు, ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు సరైన ప్రణాళికతో పంటలు సాగు చేసి, సాగులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు వహించాలని డాక్టర్ బి. సతీష్ చంద్ర కోరారు.

## రైతులకు నీళ్లు అడిగితే ప్రతిపక్షల రక్తం పరిస్తా అంటావా రేవంత్ రెడ్డి

**మాజీ కో అప్షన్ సభ్యులు సయ్యద్ ఇక్బాల్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట**

జిల్లా గజ్వెల్ నియోజకవర్గం కనీసం అవగాహన లేని సీఎం అంటే అది సీఎం రేవంత్ రెడ్డినని మాజీ మండల కో అప్షన్ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ అని అన్నారు. జగదేవపూర్ మండల కేంద్రంలోని ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం లో మాజీ మండల కో అప్షన్ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ రైతులకు నీళ్లు అడిగితే ప్రతిపక్షల రక్తం పరిస్తా అంటావా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. నీళ్ల విషయంలో ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండున్నారా ఏండ్లు అవుతున్న నీకు నీళ్లపై కనీసం అవగాహన లేకపోయే అని రైతులకు పంటపోలాలకు నీళ్లు అడిగితే ప్రతిపక్షల నోరునొక్కలని చుస్తే ఊరుకునేది లేదని హెచ్చరిక చేశారు. ప్రతిపక్షల మీద ఉన్న శ్రద్ధ రైతుల పంట పొలాల మీద సోయి లేకపోయే అని హేద్దేవా చేశారు. ఒక ముఖ్యమంత్రి స్థానశీలో ఉండి ప్రతి పక్షల రక్తన్ని పొలాల్లో చాల్లుతమనడం ఆయన రక్తపిపాసి మనస్తత్వానికి నిదర్శనం అని విమర్శించారు. రైతులు నీళ్లు అడుగుతుంటే రేవంత్ రక్తం గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన ప్రతిపక్షలకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజల రక్తం తాగడం అలవాటేనని, రైతుల హక్కుల కోసం ప్రతిపక్ష నాయకులశీ తాము రక్తం చిందించడనికైనా సిద్దమే కానీ రైతుల పొలాలకు నీళ్లు ఇవ్వాలని తీవ్రంగా మండి పడ్డారు.

మంగళవారం 14 జూలై 2026
http://www.agnidharanews.com
అగ్నిధార
నిజాల నిప్పు కణిక

# విద్యారంగంపై ప్రభుత్వం ఫోకస్





**నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ముందుకు..**
**మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యత..**
**ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే విజయ రమణారావు....**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

విద్యారంగం అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. పెద్దపల్లి మండలంలోని హనుమంతుని పేట, మారేడు గొండ , మూలసాల, గుర్రంపల్లి గ్రామాల్లో డిఎంఎఫ్ టి నిధులు రూ. 1.18 కోట్ల వ్యయం తో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం, రిపేర్లు, టాయిలెట్స్, కిచెన్ షెడ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలోని పలు గ్రామాల్లో మొత్తం రూ. 5.70 కోట్ల నిధులు స్కూళ్లలో మౌలిక సదుపాయాల నిర్మాణానికి మంజూరు పొందినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వ బడులను బలోపేతం చేసేందుకు పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేస్తున్నారని చెప్పారు. మధ్యాహ్న భోజనంతోపాటు ఉదయం అల్పాహారం అందించడం జరుగుతోందని అన్నారు. నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎస్ ఎస్ సీ ఫలితాల్లో గత సంవత్సరం రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లా అగ్రభాగాన నిలవడం అభినందనీయమని చెప్పారు. ఇందులో పెద్దపల్లి జిల్లాలో పెద్దపల్లి మండలం ముందు ఉన్నదని అన్నారు. ఉపాధ్యాయులు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, విద్యాశాఖ అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించడం వల్లనే ప్రభుత్వ బడులలో మంచి ఫలితాలు వస్తున్నాయని అభినందించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలకులు పెద్దపల్లి నియోజకవర్గం లోని ప్రభుత్వ స్కూల్స్ పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని అన్నారు. తమ సొంత ప్రైవేట్ విద్యాసంస్థల అభివృద్ధిని పెంచుకునేందుకు ప్రభుత్వ స్కూల్స్ అభివృద్ధిని అడ్డుకున్నారని చెప్పారు. హనుమంతుని పేట పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 200 మందికి పెరిగిందన్నారు. ప్రభుత్వ స్కూల్స్ పట్ల ప్రజల్లో విశ్వాసం పెరుగుతోందని చెప్పారు. రానున్న రోజుల్లో స్కూల్స్ లలో టీచర్లు విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని ఆయన కోరారు.

ఈకార్యక్రమాల్లో...సర్పంచులు.. మేడగొని శ్రీనివాస్, గుర్రం దేవేంద్ర నాగరాజు, సంపత్,కనపర్తి సంపత్ రావు కాంగ్రెస్ నాయకులు కటుకురి సుధాకర్ రెడ్డి, మాదిరెడ్డి నరసింహారెడ్డి, బండారి రామ్మూర్తి,మండల సత్యనారాయణ రెడ్డి, ఆర్కుటి సంతోష్ ఆడెపు వెంకటేశం,గన్నమనేని తిరుపతిరావు, యనగందుల ప్రదీప్, ముత్యాల నరేష్, సుధాకర్ రెడ్డి, వెంకటేష్, రాజేశం, జూపాక శ్వేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అధికారులు, పాఠశాల ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు,ప్రజలు పాల్గొన్నారు.

# నులిపురుగుల నివారణ కై ఆల్బెండజోల్ మాత్రాల పంపిణీ



**నిజామాబాద్ :** జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహిస్తున్న "జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవనీ" కార్యక్రమాన్నీ పురస్కరించుకొని ఈరోజు మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ వద్ద గల మహాత్మ జ్యోతిబాపూలే హైస్కూల్ నందు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ ని అడిషనల్ కలెక్టర్ శ్రీ భుజంగరావు గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఒకటి నుండి 19 సంవత్సరాలలోపు విద్యార్థులందరికీ ఆల్బెండజోల్ మాత్రలు జులై 13 వ తేదీ ఈ రోజున జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా అందజేయడం జరుగుతుంది అని అన్నారు. విద్యార్థుల శారీరక మానసిక ఎదుగుదలకు ఆల్బెండజోల్ మాత్రలు ఉపయోగపడుతుందనీ అన్నారు. ప్రధానంగా ఏ లిక పాములు కొంకిపురుగులు, నులిపురుగులు, వల్ల విద్యార్థులలో రక్తహీనత, అలసట, కడుపులో నొప్పి, డయేరియా, డీసెంట్రీ, లక్షణాలు కనిపిస్తాయని అన్నారు. కాబట్టి ఒకటి నుండి 19 సంవత్సరాల వయసు విద్యార్థులందరూ ఆల్బెండజోల్ మాత్రను బాగా నమిలి చప్పరించాలన్నారు. భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులు శుభ్రత పాటించాలని తెలియజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోష కాహారము, వ్యక్తిగత పరిశుభ్రత,వివిధ అంశాలపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిని డాక్టర్ బి రాజశ్రీ గారు మాట్లాడుతూ జిల్లాలో అర్హులైన మొత్తం ఒకటి నుండి 19 సంవత్సరాల విద్యార్థులు 390297 మంది ఉన్నారన్నారు. విద్యార్థులు చేతివేళ్ల గోళ్ల శుభ్రతను పాటించాలన్నారు, అమ్మాయిల్లో రక్తహీనత 12 గ్రాములకు మించి ఉండాలని, ఐరన్, క్యాల్షియం, ప్రోటీన్ అధికంగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవాలన్నారు. ఈరోజు ఆల్బన్ డాజోల్ మాత్రలు తీసుకొని వారు జూలై 20వ తేదీ రోజు తప్పకుండా తీసుకోవాలన్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో డిఐఓ డాక్టర్ అశోక్, రీజనల్ కోఆర్డినేటర్ సత్య నాథ రెడ్డి, డీఈవో అశోక్, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ సికందర్ నాయక్, ప్రిన్సిపాల్ స్వప్న ,ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శిఖర, డాక్టర్ నవ్య, , వైద్యాధికారులు డాక్టర్, రాజశ్రీ ,డాక్టర్ అజ్మల్, డాక్టర్ అరవింద్, డిప్యూటీ డెమో దుర్గారావు,డి హెచ్ ఈ ఘన్పూర్ వెంకటేశ్వర్లు, డి ఈ ఐ సి మేనేజర్ సచిన్, సి హెచ్ ఓ గిరిబాబు, ఆర్ బి ఎస్ కే సిబ్బంది, పర్యవేక్షణ అధికారులు కిషన్ ,ప్రమీల ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల విద్యార్థినిలు పాల్గొన్నారు.

# అమరావతి ఈఎంఎస్ సంస్థను ప్రారంభించిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి



**స్థానిక యువతకు ఉపాధి అవకాశాలను ఇవ్వడం అభినందనీయం..**

**అమరావతి ఈఎంఎస్ నిర్వాహకులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు**

**సూర్యాపేట :** కోదాడ మండలం రెడ్లకుంట గ్రామ శివారులో నూతనంగా ఏర్పాటు చేసిన అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి ప్రారంభించారు.వేద మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించి ఫ్యాక్టరీని ప్రారంభించిన ఎమ్మెల్యే అనంతరం సంస్థలోని ఉత్పత్తి విభాగాలు,యంత్రాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి మాట్లాడుతూ, కోదాడ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి పరిశ్రమలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు ప్రాంత ఆర్థికాభివృద్ధికి కూడా ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని తెలిపారు. అమరావతి ఈఎంఎస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను ఏర్పాటు చేసిన వై. అనంతరావు, వై. కరాళ్ బోస్, డాక్టర్ స్టాలిన్లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పరిశ్రమ మరింత అభివృద్ధి చెంది స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి కల్పించాలని ఆకాంక్షించారు. నాణ్యమైన ఉత్పత్తులతో సంస్థ మంచి గుర్తింపు సాధించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.సంస్థ నిర్వాహకులు చైర్మన్ వై అనంతరావు, మేనేజింగ్ డైరెక్టర్ కారల్ బోస్, సీఈఓ డాక్టర్ స్టాలిన్ మాట్లాడుతూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేయడమే లక్ష్యంగా పరిశ్రమను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానిక యువతకు ప్రాధాన్యతనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పించనున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బి. నరసింహారావు, స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఫర్ ఉమెన్ కార్యదర్శి, కరస్పాండెంట్ కె. కృష్ణారావు, ప్రజాప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, స్థానిక నాయకులు, సంస్థ సిబ్బంది, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పద్మశాలి నూతన పాలకవర్గ సభ్యులను సన్మానించిన 'దేవసాని బలగం-కుటుంబ పరివార్'

**చేనేత రంగానికి ప్రత్యేక నిధులు కేటాయించి, పద్మశాలీలను ఆదుకోవాలి: ప్రభుత్వానికి విజ్ఞప్తి**
**చేనేత కార్మికుల సంక్షేమమే మా లక్ష్యం: చేనేత సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని చేనేత పారిశ్రామిక సహకార సంఘం నూతన పాలకవర్గ సభ్యులకు 'దేవసాని బలగం-కుటుంబ పరివార్' అక్కారం-గజ్వేల్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సంఘశీ నూతన పాలకవర్గ సభ్యులను శాలువాలు మరియు మెమెంటోలతో ఘనంగా సత్కరించి, మిఠాయిలు పంచి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా స్వర్గం రాజేశం మాట్లాడుతూ చేనేత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ గత 14 సంవత్సరాలుగా చేనేత సహకార సంఘానికి ఎన్నికలు జరగకపోవడం వల్ల సంఘం ఆశించిన స్థాయిలో అభివృద్ధికి నోచుకోలేదని, దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా నూలు వస్త్రాల తయారీ కూడా కుంటుపడిందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో సమిష్టి నిర్ణయాలతో కార్మిక సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ద్వారా అందే నేతన్న భరోసా, నేతన్న మిత్ర, నేతన్న పింఛన్లు, నేతన్న పొదుపు పథకాలు, రూపాయలు 5 లక్షల ప్రమాద బీమాతో పాటు ముడిసరుకులు, నూలు, రసాయనాల సబ్సిడీలను అర్హులైన కార్మికులందరికీ అందేలా చూస్తామన్నారు.కార్పొరేట్ కంపెనీల రాక వల్ల నిరుపేద చేనేత కార్మికులు ఉపాధి కోల్పోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి పద్మశాలీలను అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో సంఘంలో సభ్యత్వాలను భారీగా పెంచి, చేనేత రంగాన్ని పూర్వవైభవానికి తీసుకురావడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని మాట్లాడుతూ అక్కారం-గజ్వేల్ పరిసర ప్రాంతాల్లో 'దేవసాని బలగం-కుటుంబ పరివార్'కు చెందిన 27 కుటుంబాలు ఉన్నాయని, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పద్మశాలి సేవా సంఘంలో 126 ఓటు హక్కు కలిగిన సభ్యులు ఉన్నారని తెలిపారు. చేనేత సంఘంలో కూడా దేవసాని కుటుంబ సభ్యులకు 'ఇంటికి ఒకరు' చొప్పున సభ్యత్వం కల్పించాలని ఈ సందర్భంగా పాలకవర్గానికి విజ్ఞప్తి చేశారు. గతంలో జరిగిన పద్మశాలి సేవా సంఘం ఎన్నికలలో దేవసాని హనుమాన్ దాస్ ని అత్యధిక మెజార్టీతో గెలిపించుకున్న విషయాన్ని గుర్తు చేస్తూ రాబోయే పద్మశాలి సంఘం ఎన్నికల్లోనూ దేవసాని బలగం సభ్యులంతా చురుకుగా పాల్గొని, సమిష్టి కృషితో విజయానికి తోడ్పడతామని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గజ్వేల్ చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉపాధ్యక్షులు పూల సత్యం, ప్రధాన కార్యదర్శి ఎనగందుల రామచంద్రం, డైరెక్టర్లు దొంతుల ప్రసాదు భాగ్యలక్ష్మి, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, సిలువేరు బలరాం, పద్మశాలి యువజన సంఘం ప్రధాన కార్యదర్శి నాగరాజు నేత, దేవసాని బలగం కుల పెద్దలు దేవసాని నాగభూషణం, దేవసాని వాసుదేవ్, పోశెట్టి, దేవసాని భాస్కర్, దయానంద సత్యానందు, పద్మశాలి సంఘం కోశాధికారి దేవసాని హనుమాన్ దాస్, సుధాకర్, శ్రీనివాస్, రాజారాం, ఓం ప్రకాష్, వేణు, రవి, రాజేందర్, బాలరాజు, ప్రసాద్ నవీన్, పద్మశాలి కుల పెద్దలు, దేవసాని కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

## గజ్వేల్ లోని 15 వ వార్డులో పర్యటించిన డీసీసీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి



**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ పట్టణం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి సోమవారం 15వ వార్డులో పర్యటించారు.అదేవిధంగా ఎస్ ఐ ఆర్ ఓటరు నమోదు హెల్ప్ డెస్క్ సందర్శించి వారు మాట్లాడుతూ ఓటును భద్ర పరచుకే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని తెలిపారు.అందరూ ప్రత్యేక ఓటు సవరణ కార్యక్రమంలో పాల్గొని ప్రజా స్వామ్యన్ని కాపాడు కోవాలనీ అవగాహన కల్పించారు. బి ఎల్ ఓ లకు సహకరించి విజయవంతం చేయాలని తెలిపారు. స్వచ్ఛందంగా సహకరించిన సామాజిక కార్యకర్త సాధాక్ పాషా, బి ఎల్ ఓ బసడి మమత,నాయకులు కృపనందం ,కనక స్వామి లకు శాలువాతో సత్కరించి అభినందిచారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్, కౌన్సిలర్స్ నక్క సంతోషి రాములు గౌడ్, గుంటుకు లక్ష్మీ శ్రీనివాస్, టి పీసీసీ కార్యదర్శి నాయిని యాదగిరి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు కొండల్ రెడ్డి, సీనియర్ నాయకులు వహీద్ ఖాన్,జోగిని లక్ష్మణ్, మహంకాళి చంద్రం, కృపనందం,వార్డ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు .

## కనీస వేతనం అమలు చేయాలని వివోఏల డిమాండ్




**ప్రతి వివోఏకు రూ.18 వేలు కనీస వేతనం ఇవ్వాలి**
**రూ.10 లక్షల భీమా కల్పించాలి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ నియోజకవర్గం జగదేవపూర్ మహిళా సంఘాల అభివృద్ధి కోసం గ్రామస్థాయిలో సేవలందిస్తున్న ఐకెపి వివోఏలకు ప్రభుత్వం కనీస వేతనం అమలు చేయాలని వివోఏలు డిమాండ్ చేశారు. ఈ మేరకు జగదేవ్‌పూర్ మండల మహిళా సమాఖ్య కార్యాలయం వద్ద నిరసన చేపట్టి, తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఐకెపి ఏపీఎం నర్సయ్యకు అందజేశారు.ఈ సందర్భంగా మండల వివోఏల అధ్యక్షుడు బిక్షపతి రెడ్డి మాట్లాడుతూ, గత 25 సంవత్సరాలుగా గ్రామీణ మహిళల అభ్యున్నతి, స్వయం సహాయక సంఘాల బలోపేతం కోసం నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ, ప్రభుత్వం ఇప్పటివరకు వివోఏలకు కనీస వేతనం అమలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రతి వివోఏకు నెలకు రూ. 18,000 వేల కనీస వేతనం చెల్లించడంతో పాటు, రూ. 10 లక్షల భీమా సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించాలని డిమాండ్ చేశారు. వివోఏల సేవలకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వివోఏ లు శ్రీనివాస్ రెడ్డి రమేష్ సుదర్శన్ సంతోష్ శంకర్ మహేష్ రమేష్ శివ దాస్ వినోద జహేద విజయ రేణుక సరళ సరిత అరుణ భవాని తదితరులు పాల్గొన్నారు.



# ‘దండోరా’ దర్శకుడితో సినిమా?

గత కొంతకాలంగా సరైన విజయాలు లేక నిరుత్సాహంలో ఉన్నారు హీరో నితిన్. గత ఏడాది విడుదలైన ‘తమ్ముడు’ కూడా పరాజయంపాలైంది. వరుస ఫెయిల్యూర్స్‌తో సినిమాలకు ఏడాది పాటు గ్యాప్ తీసుకున్న నితిన్.. ఇటీవలే మూడు సినిమాలకు ఓకే చెప్పిన విషయం తెలిసిందే. అందులో ఓ చిత్రాన్ని వాల్‌పోస్టర్ సినిమా పతాకంపై హీరో నాని తెరకెక్కించబోతున్నారు. ‘దండోరా’ ఫేమ్ మురళీకాంత్ దర్శకత్వం వహిస్తాడు. ‘దండోరా’ తరహాలోనే తెలంగాణ నేపథ్యంలో సామాజిక అంశాలను స్పృశిస్తూ సాగే సినిమా ఇదని సమాచారం. ఇందులో నితిన్‌కు జోడీగా రుక్మిణి వసంత్ నటించబోతున్నది. గ్లామర్ హంగులకు దూరంగా పర్‌ఫార్మెన్స్ ఓరియెంటెడ్‌గా ఆమె పాత్ర సాగుతుందని చెబుతున్నారు. త్వరలో ఈ చిత్రానికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుంది. ఆగస్ట్‌లో ఈ సినిమా సెట్స్ మీదకు వెళ్తుందని సమాచారం.

# నాగచైతన్య కొత్త సినిమా?

ప్రస్తుతం అగ్ర కథానాయకుడు అక్కినేని నాగచైతన్య ‘వృషకర్మ’ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ చివరి దశకు చేరుకున్నది. ఈ సినిమా తర్వాత చేయాల్సిన ప్రాజెక్ట్‌ని కూడా నాగచైతన్య ఇప్పటికే సిద్ధం చేసుకున్నారు. ‘బెదురులంక 2012’ చిత్రం ద్వారా గుర్తింపు తెచ్చుకున్న క్లాక్స్ దర్శకత్వంలో ఆయన తర్వాత సినిమా ఉంటుంది. ఈ సినిమాను ఈ ఏడాది చివర్లో సెట్స్ పైకి తీసుకెళ్లే యోచనలో చైతూ ఉన్నారు. ఇదిలావుంటే.. ఈ క్రమంలోనే ‘మసూద’ దర్శకుడు సాయికిరణ్ కూడా ఇటీవలే చైతూకి కథ వినిపించారట. తన తొలి సినిమా ‘మసూద’తో బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని అందుకున్న సాయికిరణ్, గత రెండేళ్లుగా ఓ హారర్ థ్రిల్లర్ స్క్రిప్ట్‌పై వర్క్ చేశారు. ఏషియన్ సునీల్ నిర్మించనున్న ఈ ప్రాజెక్ట్ కోసమే చైతూని సాయికిరణ్ కలిసినట్లు, కథ వినిపించినట్టు తెలిసింది. అన్నీ కుదిరితే వచ్చే ఏడాది ఈ సినిమా సెట్స్‌పైకెళ్లే అవకాశం ఉన్నది.






# మా అమ్మ భావోద్వేగానికి గురయ్యారు: భాగ్యశ్రీ బోర్సే

“లెనిన్’ సినిమా విజయం నాకు గొప్ప ఆనందాన్ని ఇచ్చింది. నేను చేసిన భారతి పాత్ర పట్ల ప్రేక్షకులు చూపిస్తున్న ప్రేమ, ఆదరణ జీవితాంతం మర్చిపోలేను. ‘లెనిన్’లో నా నటన పట్ల మా అమ్మానాన్నలు చాలా సంతోషంగా ఉన్నారు. మా అమ్మగారు నాకు ఫోన్ చేసి, ‘సినిమా చాలా బాగుంది.. నీ నటన కూడా ఎంతో బాగా అనిపించింది’ అన్నారు. అయితే భారతి పాత్ర ముగింపు చూసి ఒక తల్లిగా చాలా భావోద్వేగానికి గురయ్యారు. ఎందుకంటే అలాంటి ముగింపును ఏ తల్లి కూడా కోరుకోదు కదా?” అని హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సే పేర్కొన్నారు. అక్కినేని అఖిల్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రం ‘లెనిన్’. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహించారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో భారతి పాత్ర పోషించిన భాగ్యశ్రీ బోర్సే చెప్పిన విశేషాలు...

“లెనిన్’ కథని మురళీ కిషోర్‌గారు చెప్పినప్పుడే నా మనసుకు హత్తుకుంది. భారతి పాత్రలో నటనకు మంచి అవకాశం ఉందని అప్పుడే అనిపించింది. ఇప్పుడు ప్రేక్షకులు ఆ పాత్రను ఇంతగా అభిమానించడం చాలా సంతోషంగా ఉంది. భారతి పాత్ర గురించి అందరూ ఎంతో ప్రేమగా మాట్లాడుతున్నారు. నాగార్జునగారు నా నటన గురించి మాట్లాడటం నాకు ఎంతో ఆనందాన్ని ఇచ్చింది. ఈ ప్రశంసలు నాకు సంతోషంతో పాటు మరింత బాధ్యతను కూడా పెంచాయి. ఋలెనిన్--భారతిల ప్రేమకథే ‘లెనిన్’. అఖిల్, నా పాత్రలు తెరపై చాలా సహజంగా కనిపించేలా ప్రతి సన్నివేశంపై ఎంతో శ్రద్ధ పెట్టి పనిచేశాం. భవిష్యత్తులో మహారాణి, యువరాణి వంటి పాత్రలు చేయాలని ఉంది. అలాంటి చిత్రాల విషయంలో రాజమౌళిగారు మాస్టర్. ఏదో ఒక రోజు ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. ‘మా ఇంటి బంగారం’ సినిమాలో సమంతగారు అద్భుతంగా నటించారు. మాలాంటి కొత్త నటీమణులకు ఆమె ఒక దారి చూపించారు. అవకాశం వస్తే అలాంటి మహిళా ప్రధాన పాత్రలు కూడా చేయాలని ఉంది. ప్రస్తుతం శివ కార్తికేయన్ తో తమిళంలో ‘సీయోన్’ సినిమా చేస్తున్నాను. అలాగే తెలుగు, తమిళ భాషల్లో మరికొన్ని కథలు వింటున్నాను. వాటి వివరాలు త్వరలోనే వెల్లడిస్తాను.

# ఆత్మతో కనకరాజు అవస్థలు



మెగా హీరో వరుణ్‌తేజ్ కథానాయకుడిగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ ‘కొరియన్ కనకరాజు’. యూవీ క్రియేషన్స్, ఫస్ట్‌ఫ్రేమ్ ఎంటర్‌టైన్మెంట్స్ పతాకాలపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ చివరి దశలో ఉన్నది. ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా సినిమా విడుదల కానున్నది. ఇప్పటికే ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చిందని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. అగ్ర కథానాయకుడు ప్రభాస్ ఈ టీజర్‌ని ఆవిష్కరించి, చిత్రబృందానికి శు భాకాంక్షలు అందించారు. రాయలసీమలోని పెనుగొండ ప్రాంతాన్ని పరిచయం చేస్తూ కనకరాజు వాయిస్ ఓవర్‌తో టీజర్ మొదలైంది. సరదాగా సాగే కనకరాజు జీవితం, ఓ కొరియన్ అమ్మాయిని ప్రేమించిన తర్వాత ఎలా మారింది? అనేది ఈ టీజర్‌లో ఆసక్తికరంగా సాగింది. ఆత్మలు, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో కామెడీ, యాక్షన్, ఫాంటసీ హారర్ అంశాలతో ఈ కథ సాగుతుందని టీజర్ చెబుతున్నది. రాయలసీమ గ్రామీణ నేపథ్యాన్ని, కొరియా వాతావరణాన్ని మేళవిస్తూ వినోదాత్మకంగా దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కించిన ఈ చిత్రంలో రితికా నాయక్ కథానాయిక. సత్య కీలక పాత్ర పోషిస్తున్నారు. కెమెరా: మనోజ్ రెడ్డి, సంగీతం: తమన్.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com